RNI No : APTEL 2020/80757

www.sreeprasthanam.in

# శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక

## ఎంపి సీఎం రమేస్ పర్యటన

కడప,కడప స్టీల్ కోసం తన వంతు కేంద్రంలో పోరాటం చేస్తానని అనకాపల్లె ఎంపీసీఎం రమేష్ అన్నారు. ఎంపీగా గెలిచిన తరువాత మొదటి సారి ఆయన సొంతజిల్లాకు వచ్చారు. కడప ఎయిర్ పోర్ట్ నుంచి భారీ ర్యాలీగా ఆయన సొంతూరుపోట్లదుర్తికి చేరుకున్నారు. దేవుడి కడప వెంకటేశ్వర స్వామి ఆలయంతో పాటుపెద్ద దర్గాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూతాను అనకాపల్లె ఎంపీగా పోటీ చేయాలని నిర్ణయించుకున్నప్పుడు కడప నుంచివచ్చి ఇక్కడ ఎలా గెలుస్తారని కొంతమంది తనతో అన్నారన్నారు. కానీ మంచివారికి ఎక్కడైనా ప్రజలు అండగా ఉంటారని అనకాపల్లె ప్రజలు నిరూపించారన్నారు.తాను అనకాపల్లె తో పాటు సొంత జిల్లా కడప ప్రజలకు కూడా అందుబాటులో ఉంటానని ,ఇక్కడి సమస్యలు కూడా తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి చొరవచూపాతానన్నారు.

## విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, పిసి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రధాన్యత ఉంటుంది.

**పెరుమాళ్ళ వర ప్రసాద్**


సంప్రదించవలసిన నంబర్లు

94916 28386 85220 22029

Land Line No : 08517 224194

కర్నూలు సంపుటి : 04 సంచిక : 72 శనివారం 13-07-2024 పేజీలు :04 వెల:రూ.2.00

## నంద్యాలలో మైనర్ బాలికపై అత్యాచారం నిందితులను వదిలే ప్రసక్తే లేదు : సీఎం చంద్రబాబు



అమరావతి : నంద్యాల జిల్లాపగిద్యాల మండలం ఎల్లాల గ్రామంలో ఎనిమిదేళ్ల బాలికను ముగ్గురు మైనర్లు అత్యాచారం చేసిన ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తీవ్రంగా స్పందించారు. మైనర్ బాలిక హత్యాచార ఘటన నిందితులను వదిలే ప్రసక్తి లేదని వెల్లడించారు. ఆడబిడ్డల తల్లిదండ్రులకు ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు.నేరాలను రాష్ట్ర ప్రభుత్వం సహించదని అన్నారు. ఆడబిడ్డల రక్షణకు సంస్థాగత మెకానిజం కావాలని అభిప్రాయపడ్డారు. తల్లిదండ్రులు పిల్లలను నిశితంగా పరిశీలించాలని అన్నారు. ఆదివారం గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల బాలిక అదృశ్యమైంది.తల్లిదండ్రుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు ముగ్గురు మైనర్లను అదుపులోకి తీసుకొని విచారించగా దీంతో వారు బాలికను అత్యాచారం, హత్య చేసి హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం అప్రోచ్ కాలువలో పడవేసామని అంగీకరించారు. అప్పటి నుంచి పోలీసులు కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం వరకు కూడా బాలిక ఆచూకి లభించలేదు.

## ఒక్క రోజులో మార్పు తీసుకురాలేం.. కొంత సమయం కావాలి..

### ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

అమరావతి : రాష్ట్రంలోని పంచాయతీలను గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆరోపించారు. పంచాయతీల్లో ఎక్కడా డబ్బులు లేవని తెలిపారు. ఒక్క రోజులో పంచాయతీల దుస్థితిని మార్చలేమని అభిప్రాయపడ్డారు. పంచాయతీల్లో మార్పు తీసుకొచ్చేందుకు కొంత సమయం పడుతుందని అన్నారు.తాడేపల్లిలోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయానికి శుక్రవారం పవన్ కల్యాణ్ వచ్చారు. ఈ సందర్భంగా సాలిడ్ అండ్ లిక్విడ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్‌పై కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరంపంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్‌పై పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ.. సాలిడ్ అండ్ లిక్విడ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్‌ను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. జలం మనకు పూజ్యనీయమని.. కాలుష్యం కాకుండా కాపాడుకోవాలని హితవు పలికారు. ప్రస్తుతం ప్లాస్టిక్ చెత్తాచెదారంతో ఇబ్బందులు వస్తున్నాయని చెప్పారు. ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు అని అన్నారు. మనుషులకే కాదు.. జంతువులకు కూడా ప్రమాదకరమే అని చెప్పారు. ప్లాస్టిక్ కవర్లు తినడం వల్ల ఆవులు చనిపోవడం బాధగా ఉందని అన్నారు. పంట కాలువలు డంపింగ్ యార్డుల్లా మారాయని అన్నారు. కాలువల్లో చెత్తను వేస్తే నీరు కలుషితమవుతుందని



అన్నారు.సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌ను పటిష్టంగా అమలు చేయాలని అధికారులకు పవన్ కల్యాణ్ సూచించారు. రాష్ట్రంలో వ్యర్థాల నిర్వహణ సరిగ్గా జరగడం లేదని అన్నారు. చెత్త నిర్మూలనకు ప్రతి ప్రభుత్వం ప్రయత్నించాలని అభిప్రాయపడ్డారు. ఏటా రూ.243కోట్ల విలువైన వ్యర్థాలను పాడేస్తున్నామని చెప్పారు. చెత్త, వ్యర్థ పదార్థాలను రీసైక్లింగ్ చేసి పంచాయతీలు ఆదాయం పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పిఠాపురంలోని తన కార్యాలయం నుంచే ౹ాజఖీఓను ప్రారంభిస్తామని తెలిపారు.వేస్ట్ మేనేజ్‌మెంట్, పరిశుభ్రతను ప్రజలు బాధ్యతగా తీసుకోవాలని పవన్ కల్యాణ్ సూచించారు. ఒక్కో పంచాయతీలో చెత్త సేకరించి సంపద సృష్టించే ప్రయత్నం చేస్తామన్నారు. పనికిరాదని మనం పడేసే చెత్తతో ఏటా రూ.2643 కోట్ల ఆదాయం రావచ్చని అన్నారు.రాష్ట్రంలో 2.5 లక్షల మందికి ఉపాధి కల్పించేందుకు వీలవుతుందని చెప్పారు. రాష్ట్రంలోని పంచాయతీల్లో ఎక్కడా డబ్బుల్లేవని అన్నారు. పంచాయతీలను గత ప్రభుత్వం నిర్వీర్యంచేసిందని ఆరోపించారు. ఒక్క రోజులో పంచాయతీల దుస్థితిని మార్చలేమన్నారు. పంచాయతీల్లో మార్పు తెచ్చేందుకు కొంత సమయం పడుతుందని చెప్పారు.

## తల్లికి వందనం స్కీమ్‌పై ఏపీ సర్కార్ కీలక ప్రకటన

అమరావతి :గత ప్రభుత్వం అమలు చేసిన అమ్మ ఒడి స్థానంలో.. కూటమి ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన తల్లికి వందనం పథకంపై పొలిటికల్ వివాదం రాజుకుంది. తల్లికి వందనం పథకం విధివిధానాలు ఇవే అంటూ..తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించింది వైసీపీ. జీవోలో ప్రతి విద్యార్థికి అని కాకుండా ప్రతి తల్లికి అని రాశారంటూ వైసీపీ నేతలు ప్రెస్ మీట్ పెట్టి మరీ భగ్గుమన్నారు. హామీలపై కూటమి నేతలు ఎన్నికలకు ముందు ఒకలా.. ఎన్నికల తర్వాత మరోలా మాట్లాతున్నారంటూ మాజీ మంత్రి పేర్ని నాని విమర్శించారు. తల్లికి ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ ఆర్థికసాయం చేస్తామన్న కూటమి ప్రభుత్వం? ఒక్క బిడ్డకే ఆర్థికసాయం ఇచ్చేలా జీవో విడుదల చేసిందన్నారు. తల్లికి వందనం పేరిట పిల్లలకు పంగనామాలు పెట్టారంటూ ఎద్దేవా చేశారు.'తల్లికి వందనం' పథకంపై వైసీపీ చేస్తున్న ప్రచారాన్ని ఖండించిన ఏపీ ప్రభుత్వం? పథకంపై ఇంకా మార్గదర్శకాలు ఖరారు చేయలేదని స్పష్టం చేసింది. సోషల్ మీడియాతో పాటు కొన్ని పార్టీలు చేస్తున్న తప్పుడు ప్రచారం నమ్మవద్దని ప్రకటించింది. ప్రభుత్వం విధి, విధానాలు రూపొందించిన తర్వాత అధికారికంగా విడుదల చేస్తామని చెప్పింది. అప్పటివరకూ ఎలాంటి అవాస్తవాలు నమ్మవద్దనీ సూచించింది.ఎన్నికల క్యాంపెయిన్ సమయంలో.. తల్లికి వందనం పేరుతో కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉన్నా కూడా? ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకూ చదివే విద్యార్థులకు ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15 వేలు చొప్పున నగదు అందిస్తామని కూటమి పార్టీలు హామి ఇచ్చాయి. ఇక ఎన్నికల్లో కూటమి అఖండ విజయం సాధించి.. అధికారం చేపట్టింది. ఈ నేపథ్యంలో తల్లికి వందనం పథకం అమలుకు మార్గదర్శకాలు ఇవేనంటూ.. కొన్ని మార్గనిర్దేశకాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. అవన్నీ ఫేక్ అని.. మార్గదర్శకాలని త్వరలోనే విడుదల చేస్తామని కూటమి సర్కార్ ప్రకటించింది.



## ఈనెల 23 నుంచి ' పొలం పిలుస్తోంది ' కార్యక్రమం : ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో ఈనెల 23 నుంచి 'పొలం పిలుస్తోంది' అనే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని ఏపీ వ్యవసాయశాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు తెలిపారు. శుక్రవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో వ్యవసాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా 'పొలం పిలుస్తోంది ' కార్యక్రమం అమలు దస్త్రంపై తొలి సంతకం చేశారు.ప్రతి మంగళవారం, బుధవారం వ్యవసాయ అధికారులు రైతుల వద్దకు వెళ్లి నూతన పద్ధతులు, ఆధునిక వ్యవసాయ సాగు పద్ధతులు, పంటల మార్పిడి, ఎరువుల వాడకం తదితర వాటిని వివరించి రైతులకు అవగాహన కల్పిస్తామని వివరించారు. వైసీపీ హయాంలో రైతాంగం అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని వెల్లడించారు. వ్యవసాయ రంగం కుదేళయ్యిందని ఆరోపించారు. రైతులు ఎలాంటి సమస్యలున్నా ప్రభుత్వం దృష్టికి తేవాలని సూచించారు.



## మాజీ సీఐడీ అధికారులపై కేసు పెట్టిన ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు..

అమరావతి : మాజీ సిఐడి చీఫ్ పివి సునీల్ కుమార్?పై కేసు నమోదైంది. గత నెల 10న ఉండి ఎమ్మెల్యే రఘురామక్రిష్ణంరాజు లేఖ ద్వారా గుంటూరు ఎస్పీకి ఫిర్యాదు చేశారు.ఈ ఫిర్యాదుపై న్యాయ నిపుణుల సలహా తీసుకున్న గుంటూరు నగరంపాలెం పోలీసులు.. పలువురు పోలీస్ ఉన్నతాధికారులపై కేసు నమోదు చేశారు. 2021 మే 14 వ తేదీన మాజీ సిఎంపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ అప్పటి ఎంపి రఘురామక్రిష్ణంరాజుపై సిఐడి అధికారులు కేసు నమోదు చేశారు. హైదరాబాద్?లో ఉన్న ఆయనను అరెస్ట్ చేసి గుంటూరు సిఐడి కార్యాలయానికి తరలించారు. రాత్రంతా కార్యాలయంలోనే విచారించారు. అనంతరం గుంటూరు కోర్టులో ప్రవేశపెట్టగా వైద్య పరీక్షలు చేసేందుకు హైదరాబాద్?లోని ఆర్మీ ఆసుపత్రికి తరలించాలని ఆదేశించారు. అనంతరం సుప్రీం కోర్టులో రఘురామక్రిష్ణం రాజుకు ఊరట లభించింది.అయితే హైదరాబాద్?లో అరెస్ట్ చేసినప్పటి నుండి కోర్టులో ప్రవేశపెట్టే వరకూ పోలీసులు నిబంధనలు ఉల్లంఘించారని.. తనను హత్య చేసే ప్రయత్నం చేశారని కంప్లైంట్ ఫైల్ చేశారు. అలాగే పోలీసులు టార్చర్ చేశారంటూ ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు.. ఎస్పీకి రాసిన లేఖలో పేర్కొన్నారు. అప్పటి ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు పోలీసులు.



బాధ్యులెవరైనా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు లేఖపై న్యాయ నిపుణుల సలహాలు తీసుకున్న పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అప్పటి సిఐడి చీఫ్ సునీల్ కుమార్?, విజయ్ పాల్?తో పాటూ మరికొంతమంది అధికారులపై కేసు పెట్టారు. సిఐడి అధికారులపైనే కేసులు నమోదు చేయడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

## మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై చంద్రబాబు ఉలుకుపలుకులేదు

### వైఎస్సార్ వైసిపి నేత కాదు ఏపీసీసీ ప్రెసిండెంట్ వై.ఎస్ షర్మిల

విజయవాడ,చంద్రబాబు అండ్ కూటమి నెల పాలన గడిచింది. చంద్రబాబు ప్రకటించిన సూపర్ 6 లో మహిళలకు ఫ్రీ బస్ వాగ్దానం పై ఇంకా ఉలుకూ పలుకూ లేదని ఏపీసీసీ ఛీఫ్ వైఎస్ షర్మిల అన్నారు. శుక్రవారం నాడు ఆమె మీడియాతో మాట్లాడారు. ఇది మంచి పథకం కాబట్టే తెలంగాణ కర్ణాటక ల్లో అమలవుతోంది. తెలంగాణ లో అధికారం లోకి వచ్చిన నెల లోపే..కర్ణాటక లో మూడో వారం లోపే ఈ పథకాన్ని కాంగ్రెస్ అమలు చేసిం. మహిళలకు రక్షణ ఆర్థిక వెసులుబాటు కలిగించే పథకం ఇది. ఈ చిన్న పథకాన్ని అమలు చేయడానికి చంద్రబాబు కు ఇంత టైం ఎందుకు పడుతుందో నాకు అర్థం కావడం లేదు. దీన్లో విధి విధానాలు ఏముంటాయి ? తల్లికి వందనం వాగ్దానం అందరి పిల్లలకూ అన్నారు..కానీ జీవో లో మాత్రం ప్రతీ తల్లికీ 15000 అన్నారు. సాక్షి లో తల్లికి పంగనామం అని రాసింది . ఇంత అయోమయం ఎందుకు?? ప్రతీ తల్లి కే 15000 ఇస్తారా.. ప్రతీ బిడ్డ కూ 15000 ఇస్తారా... చంద్రబాబు క్లారిటీ ఇవ్వాలి. గతం లో జగన్ కూడా ఇలానే మోసం చేశారు. నాతో కూడా అప్పట్లో ఇలానే ఎంతమంది ఉంటే అంతమంది బిడ్డలకూ అంటూ జగన్ తప్పుడు ప్రచారం చేయించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ గురించి టీడీపీ నేతలు పరస్పర విరుద్ధ ప్రకటనలు చేయిస్తున్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ కు కాప్టీవ్ మైన్ కేటాయించాలి .టీడీపీ వాళ్లు మోడీ నీ ఒప్పిస్తామంటున్నారు .ఒకవేళ ఆయన ఒప్పుకోకుంటే ఏం చేస్తారు. 10 ఏళ్లుగా ఏపీ నీ మోసం చేస్తున్న మోదీ మీద నమ్మకం ఉంది అని టీడీపీ వాళ్లు ఎలా అంటారు. మోడీ అంటేనే మోసం..ఏపీ కి పదేళ్లు గా వెన్నుపోటు పొడుస్తున్నారు మోదీ . వైజాగ్ స్టీల్ కోసం వైఎస్ఆర్ పాటు పడితే గత ఐదేళ్లు జగన్ దానికోసం ఎలాంటి చర్యా తీసుకోలేదు. చంద్రబాబు ఇప్పుడు అయోమయం ప్రకటనలు ఇప్పిస్తున్నారు. వైఎస్ఆర్ ఉమ్మడి ఏపీ నాయకుడి గా రెండు సార్లు ఎన్నుకోబడ్డారు..అలాంటి వ్యక్తి విగ్రహాలను టీడీపీ గూండాలు ధ్వంసం చేస్తున్నారు. వైఎస్ఆర్ వైసిపి నాయకుడు కాదు. వైసిపి కక్ష పూరిత చర్యలు చేసి ఉండొచ్చు . .మేము కాదనడం లేదు..కానే వైఎస్ఆర్ ను దానికి బాద్యుడి నీ చేస్తే ఎలా ..? వైఎస్సార్ కాంగ్రెస్అంటే యువజన శ్రామిక రైతు పార్టీ ..వైఎస్ రాజశేఖర రెడ్డి పార్టీ కాదు... ఆయన కూ వైసిపి కూ ఎలాంటి సంబంధం లేదని అన్నారు.



## ఆర్ధాంతరంగా బస్సును ఆపేశారు

విజయవాడ, కృష్ణాజిల్లా బాపులపాడు మండలం వీరవల్లి వద్ద జాతీయ రహదారిపై ప్రయివేటు ట్రావెల్స్ బస్సు ఆగిపోయింది. 36 మంది ప్రయాణికులతో వైజాగ్ నుండి హైదరాబాద్ వెళుతుండగా అర్ధరాత్రి 2 గంటలకు ఎలిగన్స్ ట్రావెల్ బస్సు ఆగిపో?యింది. ఏమైందో చెప్పకుండా బస్సు వదిలి డ్రైవర్, క్లినర్ వెళ్లిపోయారు. ప్రయాణికులు అర్ధరాత్రి 2 గంటల నుండి చిన్న పిల్లలతో నడి రోడ్డుపై పడిగాపులు కాస్తున్నారు. మీడబ్బులు మీకు ఇస్తాము వెళ్ళండి అని నిర్లక్ష్యపు సుమాధానం ఎలిగన్స్ ట్రావెల్స్ యాజమాన్యం చెబుతుందని ప్రయాణికులు ఆరోపించారు. వారిలో ఓ మహిళ 11 గంటలకు ఉద్యోగం కోసం సర్టిఫికెట్లు అందజేయాల్సి ఉంది.

## సంపద సృష్టించడం దేవుడెరుగు.. అప్పులు సృష్టించడంలో చంద్రబాబు నంబర్‌వన్ : పేర్ని నాని

అమరావతి : ఏపీలో సంపద సృష్టించడం దేవుడెరుగు.. అప్పులు సృష్టించడంలో చంద్రబాబు నంబర్‌వన్ అవుతున్నారని వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి పేర్ని నాని ఆరోపించారు. సంపద సృష్టించి అమరావతిని అభివృద్ధి చేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. అభివృద్ధిపై ఎవరైనా ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని, అక్రమ కేసులు పెడుతున్నారని వెల్లడించారు. వైసీపీ పార్టీ తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.గత వైసీపీ ప్రభుత్వంపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం అసత్యాలతో శ్వేతపత్రం విడుదల చేస్తోందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసత్యాలు, తప్పుడు అంకెలతో దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో ప్రజలను మోసం చేస్తున్నది చంద్రబాబేనని, బాబు అనాలోచిత నిర్ణయం వల్ల డయాఫ్రం వాల్ కొట్టుకుపోయిందని ఆరోపించారు. 2014-19 వరకు కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలోని టీడీపీ వల్ల పోలవరానికి తీరని నష్టం జరిగిందని విమర్శించారు.వైఎస్ జగన్ హయాంలో డయాఫ్రం వాల్, స్పిల్‌వే కట్టామని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి పిల్లాడికి రూ.15 వేలు ఇస్తామన్న వాగ్దానం ఏమైందని నిలదీశారు. తల్లికి వందనం.. పిల్లలకు మాత్రం పంగనామాలు పెడుతున్నారని ఆరోపించారు. అధికారంలోకి రాకముందు ఒకమాట, వచ్చిన తరువాత మరో మాట మాట్లాడడం చంద్రబాబుకు అలవాటని విమర్శించారు. ఉచిత ఇసుక అంటూనే డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.



# సంపాదకీయం

శనివారం 13-07-2024

## జమ్మూలో ఏం జరుగుతోంది...

జమ్ము మళ్లీ నెత్తురోడుతోంది. లోయలో మళ్లీ అలజడి పెరుగుతోంది. గన్‌లు మళ్లీ గ్యాప్ లేకుండా గర్జిస్తున్నాయి. మృతుల సంఖ్య పెరుగుతోంది. ఇంతకీ జమ్మూలో ఏం జరుగుతోంది.. ? ఒక్కసారిగా ఈ వరుస దాడులు పెరగడానికి రీజన్ ఏంటి ?మే 4.. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ కాన్వాయ్‌పై దాడి.. ఎంఈ సోల్జర్ విక్కి పహాడే మృతి.జూన్ 9.. రాయిసీలో భక్తుల బస్సులపై దాడి.. 9 మంది మృతి.. 42 మందికి గాయాలు.జూన్ 11.. బడేర్‌వాహ్‌లో దాడి.. ఐదుగురు జవాన్లు, ఓ పోలీసాఫిసర్‌కు గాయాలు.జూన్ 12.. డోడాలోని టెంపరరీ ఆపరేటింగ్ బేస్‌పై దాడి.. ఓస్పెషల్ ఫోర్సెస్ కమాండోకు తీవ్రగాయాలు.. ఓ ఉగ్రవాది మృతి.జూన్ 26.. డోడాలో ఎన్‌కౌంటర్.. ముగ్గురు జైషే ఇ మహ్మద్ టెర్రరిస్టుల ఏరివేత.ఈ లెక్కలు మొత్తం జమ్ము కశ్మీర్‌కు సంబంధించినవి కావు. జస్ట్ జమ్ములో మాత్రమే ఉగ్రవాదులు సృష్టించిన నరమేధం ఇది. నిజానికి ముందు జమ్ములో ఎక్కువగా ఉగ్రదాడులు జరిగేవి. కానీ ఇప్పుడు జమ్ములో ఎక్కువగా అలజడి సృష్టిస్తున్నారు ఉగ్రవాదులు. దారుణమైన విషయం ఏమిటంటే.. ఒకానొక సమయంలో మూడు రోజుల్లో మూడు దాడులు చేశారు ఉగ్రవాదులు. దీంతో ఔఎం రంగంలోకి దిగింది.. ఇన్వెస్టిగేషన్ ప్రారంభించింది. కానీ.. ఈ దాడులు ఆగలేదు. మళ్లీ 24 గంటల తేడాతో మళ్లీ పలుచోట్ల ఉగ్రవాదుల అలజడి. గత ఆదివారం రాజౌరీలోని ఆర్మీ క్యాంప్‌పై దాడి.. ఓ సోల్జర్ మృతి. ఇది జరిగిన గంటల్లోనే కుల్గాం డిస్ట్రిక్ట్‌లో జరిగిన సపరేట్ ఎన్‌కౌంటర్స్‌లో ఆరుగురు టెర్రరిస్టులను మట్టుపెట్టింది ఆర్మీ. కానీ.. ఆ కాల్పుల్లో ఇద్దరు సోల్జర్స్ కూడా మృతి చెందారు. ఇది జరిగిన తర్వాత ఆర్మీ కాన్వాయ్‌పై దాడి చేశారు. ఐదుగురు జవాన్లు మృతి చెందారు.. ఆరుగురికి గాయాలయ్యాయి.నిజానికి ఇది చాలా సీరియస్ విషయం. ఒక్కసారిగా దాడులు ఎలా పెరిగాయి ? ఉగ్రవాదులు ఎలా సరిహద్దులను దాటి వచ్చారు ? వారికి ఎవరు షెల్టర్ ఇస్తున్నారు? స్థానికంగా సహాయం అందుతుందా ? ఆర్మీ వెహికల్స్ రూట్ మ్యాప్ ఎలా తెలుస్తుంది ? గెరిల్లా వార్ ఫేర్‌లో అంత ఎక్స్‌పర్ట్స్‌గా ఎలా మారారు ? కమాండో తరహా శిక్షణ ఎవరిచ్చారు ? అన్ని ప్రశ్నలే.. అయితే ఈ ప్రశ్నల పరంపర ఇక్కడితో ఆగడం లేదు. ఇప్పుడే ఈ దాడులు ఎందుకు చేస్తున్నారు ? ఈ దాడులతో ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారు ? ఇది ఏదైనా డైవర్షన్ ప్లానా ? ఆర్మీ అటెన్షన్ జమ్ముకు డైవర్ట్ చేసి ఇంకేదైనా పెద్దగా ప్లాన్ చేస్తున్నారా ? అనే ప్రశ్నలు ఇప్పుడు బుర్రను తొలిచేస్తున్నాయి.నిజానికి ఉగ్రవాదులు రాటు తేలారు. వారిని ఉగ్రవాదులు అనేకంటే.. స్పెషల్ ఫోర్స్ కమాండో ఎంత ట్రైనింగ్‌తో ఉంటారో.. అలా ఉగ్రవాదుల వ్యూహాలు ఉన్నాయని చెబుతున్నారు ఆర్మీ అధికారులు. జంగిల్ వార్ ఫేర్‌తో పాటు అత్యాధునిక ఆయుధాలను ఉపయోగిస్తున్నట్టు గుర్తిస్తున్నారు. దాడి చేయడం వెంటనే అడవుల్లోకి పారిపోవడం.. వారిని వేటాడటానికి వచ్చిన సైనికులను ట్రాప్ చేసి చంపేసే ఎత్తుగడలు కనిపిస్తున్నాయి. కథువాలో జరిగిన దాడిని చూస్తే ఇది అర్థమవుతోంది. మొదట ఆర్మీ కాన్వాయ్‌లోని డ్రైవర్‌ను టార్గెట్ చేసుకున్నారు. ఆ తర్వాత వెంటనే గ్రనైడ్ వేశారు.. దీని నుంచి తెరుకునే లోపే కాల్పులు ప్రారంభించారు. దీంతో బలగాలకు రియాక్ట్ అయ్యే టైమ్ కూడా దొరకలేదు. ఆ వెంటనే మళ్లీ అడవుల్లోకి పారిపోయారు.కాబట్టి వీరికి పాకిస్థాన్‌లో హైలెవల్‌లో ట్రైనింగ్ ఇచ్చినట్టు క్లియర్ కట్‌గా తెలిసిపోతుందంటున్నారు ఆర్మీ అధికారులు. అంతేకాదు జమ్ము కశ్మీర్ ప్రశాంతంగా ఉండటం దాయాది దేశానికి ఇష్టం లేనట్టు క్లియర్ కట్‌గా అర్థమవుతోంది. ప్రస్తుతంఇండియా గ్రోత్ రేట్ రోజురోజుకు పెరుగుతోంది. దీంతో ఇండియా అన్ని విషయాల్లో ఇంకా సక్సెస్ కాలేదు. దానికి జమ్మునే బెస్ట్ ఎగ్జాంపుల్ అని చెప్పకనే చెబుతున్నారు టెర్రరిస్ట్‌లు. అంతేకాదు జమ్ముకశ్మీర్‌లో త్వరలో ఎన్నికలు నిర్వహించాలని చూస్తోంది కేంద్రం. లేటెస్ట్‌గా ప్రధాని మోడీ లోక్‌సభలో కూడా అనౌన్స్ చేశారు. త్వరలో కశ్మీర్‌లో ఎలక్షన్స్ నిర్వహించి తీరుతామని.. ఈ విషయం ఉగ్రసంస్థలకు అస్సలు మింగుడు పడటం లేదు. అందుకే ఇంకా మేమున్నామని తమ అస్థిత్వాన్ని చాటుతున్నారు.మరి కేంద్రం వద్ద ఉన్న యాక్షన్ ప్లాన్ ఏంటి ? ఎలాంటి చర్యలు తీసుకోబోతుంది ? ఈ ప్రశ్నకు తమ వద్ద సమాధానం ఉంది కానీ.. ప్రత్యేక కారణాల వల్ల బయటికి చెప్పలేమంటున్నారు ఆర్మీ అధికారులు. అయితే రెండు విషయాలపై ఆర్మీ ఫోకస్ చేసినట్టు కనిపిస్తోంది. అడవుల్లో నక్కి.. దాడులు చేస్తున్న ఉగ్రవాదులను ఏరివేయడం ఫస్ట్ చాయిస్ కాగా.. ఈ మధ్య యాక్టివ్ అయిన ఉగ్ర నెట్‌వర్క్‌ని కట్ చేయడం సెకండ్ చాయిస్‌లా కనిపిస్తోంది.

# అమరావతికి షాక్..!

విజయవాడ, జూలై 12, (న్యూస్ పల్స్) అమరావతికి షాక్. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి కొత్త శోభతో వెలుగొందుతోంది. కొత్తగా ఊపిరి పోసుకుంది. ఐదేళ్ల వైసిపి పాలనలో విధ్వంసమైన అమరావతి రాజధానిని తిరిగి గాడిన పెట్టేందుకు ప్రయత్నిస్తోంది.అమరావతిని పూర్వస్థితిలోకి తెచ్చి నిర్మాణాలు ప్రారంభించేందుకు కసరత్తు చేస్తోంది.కొత్త ప్రాజెక్టుల కోసం ప్రయత్నిస్తోంది.అటు అమరావతిలో రవాణా సౌకర్యం మెరుగుపరిచేందుకు కీలక రోడ్ల నిర్మాణం చేపట్టాలని భావిస్తోంది. అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణాన్ని శరవేగంగా జరపాలని భావిస్తోంది. సరిగ్గా ఇటువంటి సమయంలోనే అమరావతికి ఎదురు దెబ్బ తగిలింది. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ తమ యూనిట్ ను అమరావతిలో మూసివేయాలని సంచలన నిర్ణయం తీసుకుంది.2014లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆ సమయంలో అమరావతిలో కీలక సంస్థలు ఏర్పాటయ్యాయి. అందులో భాగంగానే ఔఊంఎ ప్రాజెక్ట్ ఇంప్లిమెంట్ యూనిట్ ఏర్పాటయింది. అప్పట్లో అనంతపురం- అమరావతి ఎక్స్ ప్రెస్ వే, అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు వంటి పలు ప్రాజెక్టులను ఇది చేపట్టింది. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చాక ఈ ప్రాజెక్టులన్ని పక్కకు వెళ్లిపోయాయి. దీంతో నేషనల్ హైవే కు సంబంధించి అమరావతి యూనిటుకు ఎటువంటి పని లేకుండా పోయింది. ఇతర ప్రాంతాల పనులను ఇక్కడ సిబ్బందికి అప్పగించారు. ఇప్పుడు దీనిని ఏకంగా మూసివేశారు. విజయవాడ యూనిట్ లో విలీనం చేశారు. దీంతో అమరావతి విషయంలో చిన్నపాటి ఇబ్బంది ఎదురైంది. అయితే కూటమి ప్రభుత్వం కేంద్రాన్ని సంప్రదించి తిరిగి తెరిపించేందుకు ప్రయత్నించే అవకాశాలు మాత్రం కనిపిస్తున్నాయి.ఇటీవల చంద్రబాబు ఢిల్లీలో పర్యటించారు. ప్రధాని మోదీ తో పాటు కేంద్ర మంత్రులను కలిశారు. అమరావతి రాజధాని నిర్మాణానికి సాయం అర్థించారు. ముఖ్యంగా రహదారుల నిర్మాణానికి అవసరమైన చర్యల గురించి వివరించే ప్రయత్నం చేశారు. దీనిపై మంత్రి నితిన్ గడ్కరి సానుకూలంగా స్పందించారు. ముఖ్యంగా అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి కేంద్రం సానుకూలంగా ఉంది. తద్వారా అమరావతికి సాయం చేశామన్న మంచి పేరు వస్తుందన్న భావనతో ఉంది. ఈ బడ్జెట్ లోనే ఐదు నుంచి పదివేల కోట్ల రూపాయలు కేటాయించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కృష్ణా, గుంటూరు జిల్లాలను కలుపుతూ 189 కిలోమీటర్ల రహదారి నిర్మాణం చేపట్టాలన్నది..ఔటర్ రింగ్ రోడ్డు ముఖ్య ఉద్దేశ్యం. ఆరు లైన్లుగా ఈ రహదారి నిర్మాణం చేపట్టాల్సి ఉంది. దీనికి నేషనల్ హైవే యూనిట్ కీలకం. ఇటువంటి సమయంలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ యూనిట్ ఎత్తివేయాలన్న నిర్ణయం తీసుకోవడం ఆందోళన కలిగిస్తోంది.అయితే ఈ విషయంలో చంద్రబాబు ప్రత్యేకంగా అభ్యర్థించే అవకాశాలు ఉన్నాయి.

తప్పకుండా కేంద్రం పునః పరిశీలన చేస్తుందని.. అమరావతి లోనే నేషనల్ హైవే అథారిటీ యూనిట్ ను కొనసాగించే అవకాశం ఉందని తెలుస్తోంది. విశ్లేషకులు సైతం అదే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.మరి ఏం జరుగుతుందో చూడాలి.అయితే ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు,విభాగాలకు అమరావతిలో భూములు కేటాయించారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో కేంద్ర సంస్థలు నిర్మాణాలు జరిపేందుకు ముందుకు రాలేదు. వారితో సిఆర్డిఏ అధికారులు సంప్రదిస్తున్నారు. కేంద్రం సైతం సానుకూలంగా ఉంది.ఇటువంటి సమయంలో నేషనల్ హైవే అథారిటీ వెనక్కి తగ్గితే.. ఆ విభాగానికి సైతం అమరావతిలో భూములు కేటాయించే అవకాశం ఉంది. మరి నేషనల్ హైవే అథారిటీ ఎలాంటి నిర్ణయం ప్రకటిస్తుందో చూడాలి. తిరిగి అమరావతిలో యూనిట్ కొనసాగుతుందన్న నమ్మకం అయితే అందరిలోనూ కనిపిస్తోంది.రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నం, కేంద్రం స్పందించే తీరుబట్టి ఆధారపడి ఉంది.

# ఆగస్టు 15 నుంచి 3 పథకాలు అమలు

విజయవాడ, జూలై 12, (న్యూస్ పల్స్) పింఛన్ల పెంపు, మెగా డీఎస్సీ , ఉచిత ఇసుక, ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు సహా పలు హామీలు నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం...మరో మూడు కీలక ఎన్నికల హామీలు అమలు దిశగా అడుగులు వేస్తోంది. పేదల ఆకలి తీర్చే అన్నక్యాంటీన్లు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, హెల్త్ ఇన్సరెన్స్ పథకాలు అమల్లోకి తెచ్చేందుకు కసరత్తు చేస్తోంది. ఆగస్టు 15నుంచి అన్న క్యాంటీన్లు అందుబాటులోకి రానున్నాయి. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కూడా అదే రోజు నుంచి అందుబాటులోకి తీసుకురానున్నారుతెలుగుదేశం( ప్రభుత్వం హయాంలో అత్యంత ఆదరణ పొందిన అన్నక్యాంటీన్లు జగన్ మూతవేశారు. ఐదురూపాయలకే పేదల ఆకలి తీర్చే ఈ క్యాంటీన్లను మళ్లీ పునరుద్ధరిస్తామని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. అలాగే కర్ణాటక, తెలంగాణ(లో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కారణమైన ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణసౌకర్యాన్ని సైతం మహిళలకు కల్పిస్తామని తెలిపారు. ఈ మేరకు ఆగస్టు 15 నుంచి అన్న క్యాంటీన్లు అందుబాటులోకి రానున్నాయి. శిథిలావస్థకు చేరిన క్యాంటీన్ భవనాలను తిరిగి పునరుద్ధరిస్తున్నారు. ఇప్పటికే 183 అన్నక్యాంటీన్లు అందుబాటులోకి తెచ్చేందుకు స్థానిక పురపాలకశాఖకు అప్పగించారు. దాదాపు 20 కోట్ల రూపాయల నిధులను రాష్ట్ర ప్రభుత్వం అందజేసింది. మరోవైపు అన్నక్యాంటీన్లకు అవసరమైన కంప్యూటర్లు, ప్రింటర్లు, ఇంటర్‌నెట్ పరికరాల కొనుగోలు కోసం మరో 7 కోట్ల రూపాయలు అందజేసింది. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే నిర్మాణ దశలో ఆగిపోయిన మరో 20 అన్నక్యాంటీన్ భవనాలు నిర్మాణాలు పూర్తి చేసేందుకు 65 కోట్ల రూపాయలు త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయనుందిఈసారి అన్నక్యాంటీన్ల నిర్వహణలో ప్రజలను సైతం భాగస్వామ్యం చేయనున్నారు. గతంలో ప్రభుత్వం ఐదురూపాయలకే టిఫిన్, భోజనం అందించగా...ఈసారి ప్రజలను సైతం ఇందులో మమేకం చేయనున్నారు. వాస్తవానికి ఇప్పటికే చాలచోట్ల అన్నక్యాంటీన్లను తెలుగుదేశం ఆధ్వర్యంలో ప్రారంభించి నిరంతరం భోజనం అందిస్తున్నారు. దాతల సహకారంతో ఈ క్యాంటీన్లు సొంతంగా నడుపుతున్నారు. పెళ్లిరోజులు, పుట్టినరోజులు లేదా తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఎవరైనా ఆరోజు ఆహారం అందించేందుకు సాయం చేస్తే వారి పేరిట భోజనాలు పెడుతున్నారు. ఇక మీదట కూడా దీన్ని కొనసాగించనున్నారు. ఎవరైనా ముందుకు వచ్చి వారు సూచించిన వారి పేరిట భోజనం పెట్టాలని కోరితే....అందుకు తగ్గ రుసుము తీసుకుని ఆ రోజు వారి పేరిట భోజనం అందించనున్నారు. అదేరోజు క్యాంటీన్ ఆవరణలో దాతల పేర్లు ప్రదర్శించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎంతమందికి భోజనం పెడితే ఎంత ఖర్చు అవుతుందనే వివరాలు త్వరలోనే వెల్లడించనున్నారు. అలాగే విరాళాలు సైతం సేకరించే పనిలో ఉన్నారు. అన్నక్యాంటీన్ పేరిట ట్రస్ట్ ఏర్పాటు చేసి దీనిద్వారా నిధులు సమీకరించనున్నారు. ఇటు దాతల సహకారం, అటు ప్రభుత్వ నిధులతో అన్న క్యాంటీన్లు గతం కన్నా మిన్నగా నిర్వహించే యోచనలో ప్రభుత్వం ఉంది.కూటమి పార్టీలు ఎన్నికల్లో ఇచ్చిన మరో కీలకహామీ మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం. దీన్ని సైతం ఆగస్టు 15న ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆర్టీసీకి వచ్చే నష్టాన్ని ప్రభుత్వం భర్తీ చేయనుంది.ఆధార్ కార్డు ఆధారంగా రాష్ట్రంలో ఉన్న మహిళల అందరికీ ఈ అవకాశం కల్పించేందుకు చకచకా ఏర్పాట్లు సాగిపోతున్నాయి. ఇప్పటికే కర్ణాటక(, తెలంగాణలో ఈ పథకం పనితీరును పరిశీలించిన అధికారులు అక్కడి ఇబ్బందులు, సాంకేతిక అంశాలు, నిర్వహణ భారంత తదితర అంశాలపై ఓ అవగాహనకు వచ్చారు. అక్కడి కన్నా మెరుగ్గా ఇక్కడ నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన మరో కీలక హామీని సైతం అమలు చేసేందుకు ఏపీ సర్కార్ కసరత్తు చేస్తోంది. ప్రతి కుటుంబానికి 25లక్షల ఆరోగ్య బీమాకల్పించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. కేంద్రం ఇప్పటికే ఆయూష్మాన్ భారత్ పేరిట 5 లక్షల ఇన్సరెన్స్ అందిస్తుండగా...దీన్ని పది లక్షలకు పెంచనుంది. దీనికి అదనంగా 15 లక్షలు కలిపి ప్రజలకు అందించేలా రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. 15 లక్షలకు అవసరమైన రాష్ట్రవాటాను ప్రభుత్వం అందించనుంది.

# ఇసుక మాఫియాకు చెక్



విజయవాడ, జూలై 12, (న్యూస్ పల్స్) ఇసుక మాఫియాకు చెక్ పడింది. చంద్రబాబు ప్రభుత్వం వచ్చీ రాగానే ఇసుక మాఫియాకు కళ్లెం వేసేలా ఇసుక విధానాన్ని తీసుకొచ్చారు. ప్రజల కళ్లలో దుమ్ము కొట్టి, ఇసుకను పొలిమేర దాటించిన ఇసుకాసురుల భరతం పట్టే బ్రహ్మాస్త్రంగా కొత్త చట్టాన్ని రూపొందించారు. చంద్రబాబు 2014-2019 పాలనలో ఉచిత ఇసుక విధానం ద్వారా ఇసుక మాఫియా కోట్లు కొల్లగొట్టిందని జగన్ ప్రభుత్వం ఆరోపిస్తూ అప్పట్లో నూతన విధానం తీసుకొచింది. నూతన ఇసుక పాలసీపై 2019 సెప్టెంబర్ 4న జగన్ ప్రభుత్వం జీవో 70, 70 జారీ చేసింది. దాని ప్రకారం టెండర్లు నిర్వహించి ఇసుక విక్రయాలకు ఒక విధానాన్ని తీసుకొచ్చారు. ఆ తర్వాత ఆఫ్ లైన్, ఆన్ లైన్ విధానాల్లో ఇసుక విక్రయాలు జరిపారు. అయినా జరగాల్సిన తంతు జరిగిపోయింది.ఇక చంద్రబాబు మొదటి తీసుకొచ్చిన ఉచిత విధానం కూడా పలు ఆరోపణలు ఎదుర్కొంది. మొదటి ఉచిత ఇసుక విధానం అమల్లో అక్రమ ఇసుక తవ్వకాలపై ఎన్జీటీ తీవ్రంగా స్పందించింది. ఏకంగా 100 కోట్ల రూపాయల జరిమానా విధించింది. ఈ తీర్పునకు సంబంధించి వచ్చిన ఆరోపణలు కూడా సీఎంగా చంద్రబాబు నివాసం ఉంటున్న కరకట్ట ప్రాంతంలో జరిగిన అక్రమ ఇసుక తవ్వకాలపైనే కావడం గమనార్హం.ఇప్పుడు చంద్రబాబు రెండోసారి ఉచిత ఇసుక విధానాన్ని తిరిగి తీసుకొచ్చారు. కొత్త ప్రభుత్వంలో ఉచితంగానే ఇసుకను అందిస్తామని చెప్పిన ప్రభుత్వం అందుకు అనుగుణంగా ఉత్తర్వులు జారీ చేసింది. కలెక్టర్లకు ఇచ్చిన అంతర్గత ఉత్తర్వుల మేరకు తాత్కాలికంగా ఇసుక సరఫరా చేసేందుకు వీలుగా ఉత్తర్వులు ఇచ్చారు. కొత్త విధానం వచ్చే వరకు ఈ ఉత్తర్వులు అమల్లో ఉంటాయి. అలాగే గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఇసుక పాలసీలను రద్దు చేసింది. ఏపీలో ఇసుక అమ్మకాల కోసం ఇచ్చిన ఉత్తర్వుల్లో తమ లక్ష్యాలను ప్రభుత్వం వివరించింది.ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఇసుక అమ్మకాల కోసం జిల్లా కలెక్టర్ చైర్మన్ గా కమిటీలు ఏర్పాటు చేస్తారు. ఎస్పీ, జేసీ వంటి అధికారులు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. ర్యాంపుల్లో తవ్వకాలు, లోడింగ్, అన్ లోడింగ్, పాలనా ఖర్చులు, పన్నుల ఆధారంగా జిల్లా కమిటీలు ఇసుక రేట్లను నిర్ణయిస్తాయి. ఇసుక కొనుగోలుదారులు యూపీఐ పేమెంట్స్ ద్వారానే చెల్లింపులు చేయాలి.ప్రతీ వినియోగదారులు రోజుకు గరిష్టంగా 20 టన్నుల ఇసుక మాత్రమే కొనుగోలు చేయాలి. పరిమితికి మించి స్టాక్ పెట్టడం, ప్రభుత్వం నుంచి తీసుకున్న ఇసుక తిరిగి అమ్మడం, ఇతర రాష్ట్రాలకు తరలింపు నిషేధం. అయితే రాష్ట్ర ఖజానాకు రెవెన్యూ లేకుండా ఇసుక సరఫరా జరపాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వినియోగదారులకు ఇసుకను ఉచితంగా ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా ఇసుక సరఫరాపై మార్గదర్శకాలు విడుదల చేసింది. అయితే గత అనుభవాల దృష్ట్యా ఈసారి చంద్రబాబు ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని రెండోసారి ఏ విధంగా అమలు చేస్తుందో చూడాలి.

ఇసుక అమ్మకాల కోసం జిల్లా కలెక్టర్ చైర్మన్ గా కమిటీల ఏర్పాటు
కమిటీల్లో సభ్యులుగా ఎస్పీ, జేసీ వంటి అధికారులు
ఇసుక అక్రమాలపై నిఘా కోసం జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ లు ఏర్పాటు
ట్రాక్టర్ తో అక్రమ రవాణ చేస్తూ పట్టుబడితే రూ.10వేలు జరిమానా
10 టైర్ల లారీతో మొదటిసారి పట్టుబడితే 25వేల జరిమానా
రెండోసారి పట్టుబడితే రూ.50వేల వరకు జరిమానా
రెండోసారి ఉచిత ఇసుక విధానాన్ని తీసుకొచ్చిన టీడీపీ ప్రభుత్వం
సరసమైన ధరలకు ఇసుకను వినియోగదారులకు అందుబాటులో ఉంచడం
ఇసుక లావాదేవీల్లో పారదర్శకత తీసుకురావడం
అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణను అరికట్టడం

# తవ్వే కొద్ది అక్రమాలు...

తిరుమల, జూలై 12, (న్యూస్ పల్స్) : తిరుమలలో తవ్వే కొద్దీ అక్రమాలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. వీఐపీలు, వివిధ దర్శనాల విషయంలో ఎన్నెన్నో అవకతవకలు బయటపడ్డాయి. ఒకేరోజు పదుల సంఖ్యలో బ్రేక్ దర్శనాలు కొనసాగాయి.మంత్రులు, ప్రజా ప్రతినిధుల వెంట పదుల సంఖ్యలో అనుచరులు బ్రేక్ దర్శనానికి వెళ్లిన సందర్భాలు కూడా ఉన్నాయి.ఇప్పుడిప్పుడే అవి వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా దర్శన టికెట్ల విషయంలో సైతం భారీ స్థాయిలో అక్రమాలు జరిగినట్లు తెలుస్తోంది.శ్రీవారి ప్రత్యేక దర్శనం, ఆర్జిత సేవా టిక్కెట్లు ఒకే ఫోన్ నెంబర్ తో ఎక్కువ టికెట్లు పొందారని టీటీడీ ఐటీ విభాగం సిబ్బంది పరిశీలనలో వెలుగు చూడడం గమనార్హం. ప్రస్తుతం ఇదే హాట్ టాపిక్ గా మారింది.చిత్తూరు జిల్లాకు చెందిన వైసిపి మాజీ మంత్రుల పేరుతో భారీగా బ్రేక్ దర్శనాలకు సిఫారసు లేఖలు అందినట్లు తెలుస్తోంది. గత ఏడాది 100 ఫోన్ నెంబర్లతో అధిక సంఖ్యలో ప్రత్యేక దర్శనం టికెట్లు, ఆర్జిత సేవా టిక్కెట్లు తీసుకున్నారని,తరువాత వాటిని ఇతరులకు విక్రయించారని అధికారులు చెబుతున్నారు. గత ఏడాది ఒకే ఫోన్ నెంబర్తో 34 సార్లు దర్శన టికెట్లు బుక్ చేశారని అధికారుల పరిశీలనలో వెలుగు చూసింది. పేరుకే ఆన్ లైన్ అని.. గోల్ మాల్ భారీగా జరిగిందని ఐటీ విభాగం చెబుతోంది. ఆన్లైన్ లో ఓ వ్యక్తి అయితే తన ఫోన్ నంబర్ తో 1279 సార్లు ఆర్జిత సేవా టిక్కెట్లు బుక్ చేసుకున్నాడని తాజాగా వెలుగు చూసింది. ఇది సామాన్య విషయం కాదని.. ఇంటి దొంగల సహకారం లేనిదే సాధ్యపడదని టీటీడీ అధికార వర్గాలు భావిస్తున్నాయి. ఈవో శ్యామలరావు దీనిపై సీరియస్ గా దృష్టి సారించారు. ప్రత్యేక విచారణకు ఆదేశించారు.సుదీర్ఘకాలం తిరుమల తిరుపతి దేవస్థానం ఈవోగా ధర్మారెడ్డి వ్యవహరించారు. దీంతో అక్రమాలకు అడ్డాగా తిరుమల మారిపోయిందన్న విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా వైసిపి ప్రజాప్రతినిధుల సిఫారసులకు పెద్దపీట వేశారన్న విమర్శ ఉంది. అప్పట్లో కొందరికి లబ్ధి చేకూరేందుకు టీటీడీ సిబ్బంది కూడా చూసీ చూడనట్టు వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. మరో ఫోన్ నెంబర్తో అయితే 403 సార్లు ప్రత్యేక దర్శనం టికెట్లు, ఆర్జిత సేవా టికెట్లు బుక్ చేశారని వెలుగు చూసింది. ఇంకో నెంబర్తో అయితే ఏకంగా 807 గదులు బుక్ చేశారని వెలుగు చూడడం ఆందోళన కలిగిస్తోంది. ఓ వ్యక్తి సంవత్సరంలో 807 సార్లు తిరుమల వచ్చి ఉండడం ఎలా సాధ్యం అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. అధికార వర్గాలు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. రోజుకు రెండుసార్లు గదులు బుక్ చేసిన కూడా ఒక సంవత్సరంలో 807 గదులు బుక్ చేయడం అసాధ్యమని..దీని వెనుక మాఫియా ఉందని.. భారీగా అవకతవకలు చోటుచేసుకున్నాయని.. సమగ్ర దర్యాప్తు కావాలని భక్తులు కోరుతున్నారు.వైసిపి పాలనలో తిరుమలలో అనేక అవకతవకలు వెలుగు చూశాయి. కానీ ప్రభుత్వం చూసి చూడనట్టుగా వ్యవహరించింది. ఫలితంగా అవినీతి పతాక స్థాయికి చేరుకుంది. ప్రత్యేక దర్శన టికెట్లు, ఆర్జిత సేవా టిక్కెట్లు, గదులు.. ఇలా అన్నింటిని దళారుల చేతిలో పెట్టి బ్లాక్ లో విక్రయించేవారన్న అనుమానాలు ఉన్నాయి. గత ఏడాది 100 ఫోన్ నెంబర్లతో అధికంగా టిక్కెట్లు కేటాయించడాన్ని అధికారులు గుర్తించారు. ఆ ఫోన్ నెంబర్లు ఎవరివి?టిక్కెట్లు ఎందుకు బుక్ చేశారు?నిజంగా టిక్కెట్లు అర్హులకు అందించారా? లేకుంటే బ్లాక్ లో అమ్మేశారా? అనేది ఆరా తీసే పనిలో పడ్డారు టీటీడీ సిబ్బంది. గత వైసీపీ ప్రభుత్వంలో చేతివాటం చూపించిన దళారులతోపాటు కొందరు టీటీడీ ఉద్యోగులు ఆందోళనతో ఉన్నారు. త్వరలో వీరికి చుక్కలు కనబడడం ఖాయమని తెలుస్తోంది.

# కేసులు... ఫిరాయింపులు

విజయవాడ, జూలై 12 (న్యూస్ పల్స్) ఏపీలో అధికారం చేతులు మారాక? కొందరు వైసీపీ నేతల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. ఐదేళ్లు అధికారంలో ఉండగా, చక్రం తిప్పిన నేతలు? నోటికి పని చెప్పిన నాయకులు?. ఇప్పుడు గుట్టుగా కాలం వెళ్లదీస్తున్నారు. తమ ఆచూకీ కూడా తెలియకుండా పూర్తిగా సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. అలాంటి వారిలో ఎక్కువగా వినిపిస్తున్న పేరు కొడాలి నాని. పౌరసరఫరాల శాఖ మాజీ మంత్రి కొడాలి నాని గత ఐదేళ్లలో ఎలాంటి సౌండ్ చేసే వారో అందరికీ తెలిసే ఉంటుంది. ఏది మంచో? ఏదో చెడో కూడా ఆలోచించకుండా ప్రత్యర్థులపై మాటలతో విరుచుకుపడి టీడీపీకి టార్గెట్ అయ్యారు కొడాలి నాని.అసెంబ్లీ, కేబినెట్ భేటీ, పబ్లిక్ మీటింగ్ ఇలా ఏదైనా సరే? వెనకా ముందు ఆలోచించకుండా? సీఎం చంద్రబాబుపై ఏకవచనంతో విరుచుకుపడిన కొడాలి నాని? ఇప్పుడు కేసులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఒకవైపు సీఎం చంద్రబాబు, మరోవైపు డిప్యూటీ సీఎం పవన్ ఉమ్మడిగా టార్గెట్ చేయడంతో కొడాలి పరిస్థితి ముందు నుయ్యి.. వెనక గొయ్యిలా తయారైంది. దాదాపు 20 ఏళ్లుగా గుడివాడలో నిర్మించుకున్న సామ్రాజ్యం? ఒక్క గాలివానకు కూలిపోయినట్లు? గత ఎన్నికల్లో కూటమి సునామీతో కొడాలి కోట గల్లంతైంది. దీంతో కష్టాలన్నీ కూడబలుక్కుని కొడాలిని చుట్టుముడుతున్నాయి.తొలుత వలంటీర్లు, ఆ తర్వాత బెవరేజస్ గొడౌన్ గొడవలో ఓ లీజుదారు మాజీ మంత్రి కొడాలిపై కేసులు పెట్టారు. ఈ కేసుల్లో ముందస్తు బెయిల్ తెచ్చుకున్న కొడాలిని.. ఇంకోవైపు నుంచి బియ్యం స్కాం కమ్మేస్తోందంటున్నారు. కాకినాడలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలతో బియ్యం స్కాంపై తనిఖీలు చేస్తున్న అధికారులు ఉచ్చు బిగిస్తుంటే? ఆ ఉచ్చులో కొడాలి కూడా ఉక్కిరిబిక్కిరి అవుతున్నట్లు పొలిటికల్ సర్కిల్స్‌లో టాక్ వినిపిస్తోంది. ఇలా కేసులతో కుమ్మేయాలని ప్రభుత్వం చూస్తుంటే? స్థానిక ప్రజలు కూడా తిరుగుబాటు చేస్తుండటం? మాజీ మంత్రికి షాకిస్తోందంటున్నారు.ఇరవయ్యేళ్లుగా గుడివాడను అడ్డాగా చేసుకున్న కొడాలి? ఈ ఎన్నికల్లో దాదాపు 50 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఇక వైసీపీ ప్రభుత్వం కూడా ఓడిపోవడంతో ఒంటరి అయ్యారు మాజీ మంత్రి కొడాలి నాని. ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే? ప్రతీకారంతో రగిలిపోయిన టీడీపీ కేడర్? మాజీ మంత్రి ఇంటిపై దాడికి వెళ్లినా ఎలాంటి చప్పుడు చేయలేదు కొడాలి నాని. అంతేకాదు తన సహజ సిద్ధశైలికి భిన్నంగా నడవడం మొదలుపెట్టారు. ఎన్నికల ఫలితాలు విడుదలై నెలరోజులు అవుతున్నా? ఒకటి రెండు సార్లు మాత్రమే బయటకి వచ్చిన కొడాలి నాని?

ఆ తర్వాత ఎక్కడున్నారో కూడా తెలియడం లేదు. పార్టీ కార్యకర్తలకు కూడా అందుబాటులో ఉండటం లేదని అంటున్నారు. ఇదే సమయంలో కొడాలి అనుచరులు ఆక్రమణల్లో ఉన్న భూములు, సినిమా థియేటర్‌ను స్థానికులు తిరిగి ఆక్రమించుకోవడం గుడివాడ రాజకీయంలో కీలక పరిణామంగా మారింది.మొత్తానికి నలువైపుల నుంచి మాజీ మంత్రి కొడాలిని ఇరుకున పెట్టడమే టార్గెట్‌గా ప్రభుత్వం పావులు కదుపుతోంది. దీనికి స్థానిక ప్రజలు సహకరిస్తుండటం.. మాజీ మంత్రిని ఊపిరి ఆడకుండా చేస్తోంది. ప్రస్తుతానికి రెండు కేసుల్లో ముందస్తు బెయిల్ పొందిన కొడాలికి కొంత ఉపశమనం లభించినా, మున్ముందు ప్రభుత్వం తీసుకోబోయే చర్యలే టెన్షన్ పెడుతున్నాయంటున్నారు. ముఖ్యంగా కాకినాడ కేంద్రంగా కూపీలాగుతున్న బియ్యం స్కాంలో కొడాలి పాత్ర ఏంటనేది ప్రభుత్వం ఆరా తీస్తోందంటున్నారు. ఏదైనా సరే కొడాలి డేంజర్ జోన్‌లో చిక్కుకున్నారని.. ఆయన బయట పడటం ఎలా అన్నదే పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్‌టాపిక్‌గా మారింది.

# హస్తమా...కమలమా...

## వైసీపీ దారెటు...



కడప, జూలై 12, (న్యూస్ పల్స్) వైసీపీకి దారుణ పరాజయం ఎదురైంది. ఓటమిని పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. అధినేత జగన్ వరుస సమీక్షలు నిర్వహించి నాయకులతో మాట్లాడుతున్నారు. నియోజకవర్గాల వారీగా వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. లోపం ఎక్కడ జరిగిందో ఆరా తీస్తున్నారు. 2029 నాటికి పార్టీని పూర్వ వైభవం దిశగా తీసుకెళ్తానని చెబుతున్నారు. పార్టీలో ప్రక్షాళన సైతం ప్రారంభించారు. పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన ఒకరిద్దరిని సస్పెండ్ కూడా చేశారు. నియోజకవర్గాల ఇన్చార్జిలను కూడా మార్చుతున్నారు. అయితే అంతవరకు ఓకే కానీ.. పార్టీలో సీనియర్లు మాత్రం మౌనం వీడడం లేదు. కొందరైతే పార్టీ కార్యక్రమాల విషయంలో అంటీ ముట్టనట్టుగా ఉన్నారు. ముఖ్యంగా జగన్ క్యాబినెట్లో మంత్రి పదవులు అనుభవించిన వారు సైతం అజ్ఞాతంలోకి వెళ్లిపోవడం ఆందోళన కలిగిస్తోంది. చాలామందికి వైసిపి పూర్వవైభవం వస్తుందని నమ్మకం లేదు. ఆ దిశగా జగన్ తీసుకెళ్లలేరనేది ఎక్కువమంది అభిప్రాయపడుతున్నారు. అందుకే ప్రత్యామ్నాయాలు చూసుకోవాలని చూస్తున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో బిజెపిలోకి వెళ్తే సేఫ్ జోన్ లో ఉంటామని భావిస్తున్నారు.జాతీయస్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలం పుంజుకుంటోంది. ఆ పార్టీ నేతృత్వంలోని ఇండియా కూటమి ఎన్డీఏకు గట్టిగానే ఫైట్ ఇచ్చింది. బిజెపి బలం సైతం తగ్గింది. ఇటువంటి తరుణంలో కొన్ని రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. అక్కడ కాంగ్రెస్ పార్టీ బలం పుంజుకుంటే ఆ ప్రభావం ఏపీ పై తప్పకుండా పడుతుంది. ఇప్పటికే కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. బిజెపికి అక్కడ జనం తిరస్కరించారు. తెలంగాణలో సైతం మూడో స్థానంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అనూహ్యంగా అధికారంలోకి రాగలిగింది. ఆ రెండు రాష్ట్రాలతో ఏపీకి ప్రత్యేక అనుబంధం ఉంది. ఇప్పటికీ వైసీపీ నేతలకు హైదరాబాదులో ఆస్తులు ఉన్నాయి. రాయలసీమ నేతలకు బెంగళూరులో వ్యాపారాలు నడుస్తున్నాయి. సహజంగానే వారు కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపుతారు. మెజారిటీ వైసీపీ నేతల పూర్వాశ్రమం కాంగ్రెస్ పార్టీ. వైసిపి బలహీనమైంది. ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం దూకుడు మీద ఉంది. అందుకే ఎక్కువమంది వైసీపీ నేతలు కాంగ్రెస్ వైపు చూస్తున్నట్లు సమాచారం. ఒకవేళ దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే మాత్రం.. వైసిపి సీనియర్లు కాంగ్రెస్ లోకి వెళ్లడం ఖాయంగా తేలుతోంది.బిజెపిలోకి తాజా మాజీ మంత్రులు చాలామంది వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నది ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి నేతృత్వంలోనే నలుగురు వైసీపీ ఎంపీలు బిజెపిలో చేరతారని టాక్ నడుస్తోంది. మరి ముఖ్యంగా కడప ఎంపీ అవినాష్ రెడ్డి ని సీఎం జగన్ బిజెపిలోకి పంపిస్తున్నారు అన్నది ఒక వార్త వైరల్ అంశంగా మారింది. మిథున్ రెడ్డి విషయంలో ఇదే తరహా ప్రచారం జరగగా.. ఆయన ఫుల్ క్లారిటీ ఇచ్చారు. వైసీపీలోనే కొనసాగుతానని తేల్చి చెప్పారు. మరోవైపు రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి నేతృత్వంలో కొందరు వైసీపీ రాజ్యసభ సభ్యులు బిజెపిలోకి వెళ్తారని కూడా టాక్ నడిచింది. జగన్ పై ఉన్న కేసుల దృష్ట్యా.. గత ఎన్నికల్లో ఓడిపోయిన టిడిపి అనుసరించిన వ్యూహాన్ని జగన్ కొనసాగిస్తారని కూడా ఊహాగానాలు వచ్చాయి. నాడు తెలుగుదేశం పార్టీ ఓడిపోయిన వెంటనే నలుగురు రాజ్యసభ సభ్యులు బిజెపిలో చేరారు. ఇలా చేరిన వారంతా చంద్రబాబుకు అత్యంత విధేయులే. ఇప్పుడు కూడా జగన్ తన విధేయులను బిజెపిలోకి పంపించి? కేసుల ప్రమాదం నుంచి తప్పించే ప్రయత్నం చేస్తారని టాక్ నడుస్తోంది. తాజాగా తాజా మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి బిజెపిలోకి వెళ్తారని ప్రచారం నడుస్తోంది. ఆర్థిక శాఖ పై శ్వేత పత్రం విడుదల చేసేందుకు చంద్రబాబు కసరత్తు చేస్తున్నారు. ఈ తరుణంలో ఆ శాఖలో చాలా రకాల అవకతవకలు వెలుగు చూసినట్లు ప్రచారం జరుగుతోంది. వైసిపి ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా అప్పులు, పరిమితికి మించి రుణాలు తీసుకున్న సంగతి తెలిసిందే. అందుకే భారీ లోపాలు వెలుగు చూసినట్లు తెలుస్తోంది. ఆర్థిక శాఖ నిర్వర్తించిన బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చుట్టూ ఉచ్చు బిగిస్తున్నట్లు సమాచారం. అందుకే సేఫ్ జోన్ గా ఉండాలంటే బిజెపి శ్రేయస్కరమని బుగ్గన భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై ఫుల్ క్లారిటీ రావాల్సి ఉంది.పరాజయం తర్వాత చాలామంది సీనియర్లు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఒకరిద్దరు తప్ప అంతా సైలెంట్ అయ్యారు. అటువంటి వారికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ టచ్ లోకి వచ్చినట్లు ప్రచారం జరిగింది. స్వయంగా కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారని.. గతం మాదిరిగా సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారని తెలుస్తోంది. గతంలో కాంగ్రెస్ పార్టీలో ఒక వెలుగు వెలిగిన నాయకులు.. తప్పనిసరి పరిస్థితుల్లో పార్టీని వీడారు. వైసీపీలో చేరారు. కానీ కాంగ్రెస్ పార్టీలో ఉన్న స్వేచ్ఛను మాత్రం వారు మర్చిపోలేదు.అందుకే కాంగ్రెస్ పార్టీ పుంజుకుంటే ఆ పార్టీలో చేరడం ఉత్తమమని చాలామంది నాయకులు ఒక భావనతో ఉండేవారు. అయితే ఇప్పుడు వైసిపి ఓడిపోవడం, కాంగ్రెస్ పార్టీ పుంజుకోవడంతో ఇటువంటి నేతలు పునరాలోచనలో పడ్డారు. ఏకంగా అగ్రనేత రాహుల్ ఆహ్వానించడంతో కొందరు సీనియర్లు సమయం చూసి కాంగ్రెస్ పార్టీలోకి వస్తామని చెప్పినట్లు సమాచారం. వచ్చే కాలంలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. వాటిలో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటితే మాత్రం ఆ ప్రభావం ఏపీ పై పడనుంది. ముఖ్యంగా వైసీపీలో ఉన్న పూర్వ కాంగ్రెస్ నేతలంతా యూటర్న్ తీసుకునే అవకాశాలు ఉన్నాయి.బిజెపిలో చేరేందుకు చాలా మంది వైసీపీ నేతలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. ఈ జాబితాలో పలువురు తాజా మాజీలు కూడా ఉన్నారు. కూటమి ప్రభుత్వంతో తమకు ఇబ్బందులు ఎదురవుతాయని భావిస్తున్న నేతలంతా బిజెపి అగ్ర నాయకత్వానికి టచ్ లోకి వస్తున్నారు. బిజెపిలోకి వచ్చేస్తామంటూ వర్తమానం పంపిస్తున్నారు. అయితే ఎన్డీఏలో కీలక భాగస్వామి కావడంతో.. టిడిపి నుంచి అభ్యంతరాలు వస్తాయని తెలిసి అగ్రనాయకత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం లేదు. బిజెపిలో అసమ్మతి వర్గం.. చాలామంది వైసిపి నేతలను చేర్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తుండగా.. రాష్ట్ర నాయకత్వం మాత్రం అడ్డు చెప్పుతున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో బిజెపికి ప్రాతినిధ్యం పెరిగింది. పార్టీ అభివృద్ధికి కృషి జరుగుతోంది.అందులో భాగంగా వైసీపీ శ్రేణులను ఆహ్వానించినా ఆశ్చర్యపోనవసరం లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే వైసిపి పాలనలో దూకుడుగా వ్యవహరించిన నేతల విషయంలో మాత్రం బిజెపి హై కమాండ్ ఒకటికి రెండుసార్లు ఆలోచన చేస్తోంది. బిజెపి భావజాలాల పట్ల ఆకర్షితులు అయినవారు కంటే.. కూటమి ప్రభుత్వం ఇబ్బందుల నుంచి తప్పించుకునేందుకు చాలామంది బిజెపి బాట పట్టడానికి ప్రయత్నిస్తున్నారు. అటువంటి వారిని మాత్రం చేర్చుకోమని బిజెపి అగ్ర నాయకత్వం తేల్చి చెబుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం కేసుల నుంచి తప్పించుకోవాలంటే బిజెపి, భవిష్యత్తు రాజకీయాలు చేయాలంటే కాంగ్రెస్.. ఈ రెండు ఆప్షన్లే వైసిపి నేతల ముందు ఉన్నాయి.

## మనుస్మృతిపై ఢిల్లీ వర్సిటీ నిర్ణయాన్ని స్వాగతించిన మాయావతి



లక్నో: న్యాయ విద్య చదువుతున్న వారికి మనుస్మృతి బోధించాలని వచ్చిన ప్రతిపాదనను ఢిల్లీ యూనివర్సిటీ తిరస్కరించింది. ఢిల్లీ వర్సిటీ తీసుకున్న నిర్ణయాన్ని బీఎస్పీ చీఫ్ మాయావతిస్వాగతించారు. న్యాయ విద్యార్థులకు మనుస్మృతి బోధించాలని వచ్చిన సలహాలను తిరస్కరించినట్లు వర్సిటీ వైస్ ఛాన్సలర్ యోగేశ్ సింగ్ తెలిపారు. మనుస్మృతి బోధనపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతున్నదని, మను చట్టాలను బోధించేందుకు వర్సిటీ అయిష్టతను వ్యక్తం చేయడాన్ని స్వాగతిస్తున్నట్లు మాయావతి తెలిపారు. అందరూ ఆమోదించే భారత రాజ్యాంగాన్ని పరమ పూజ్యులు బాబా సాహెబ్ అంబేద్కర్ రాశారని, నిర్లక్ష్యానికి గురైన మహిళలను దృష్టిలో పెట్టుకుని ఆయన రాజ్యాంగాన్ని రాశారని, ఇది మనుస్మృతికి ఏ మాత్రం తీసిపోదని, అందుకే ఆ స్మృతులను బోధించడం సరికాదు అని యూపీ మాజీ సీఎం మాయా పేర్కొన్నారు.న్యాయ విద్యార్థుల సెలబస్‌లో మార్పులు చేయాలని, ఫస్ట్, థార్డ్ ఇయర్ విద్యార్థులకు మనుస్మృతి బోధించాలని లా ఫ్యాకల్టీ నిర్ణయం తీసుకున్నది. అయితే దీనిపై ఢిల్లీ వర్సిటీ నుంచి అనుమతి కోసం ఆ ఫ్యాకల్టీ ఎదురుచూసింది. రెండు వర్షన్స్‌కు చెందిన మనుస్మృతిని విద్యార్థులకు పరిచయం చేయాలని భావించారు. జీఎన్ జా రాసిన మనుభ్యాస ఆఫ్ మేధతితి, టీ కృష్ణస్వామి అయ్యర్ రాసిన మనుస్మృతి-స్మృతిచంద్రికను విద్యార్థులకు ఇంట్రడ్యూస్ చేయాలని ప్రతిపాదించారు. జూన్ 24వ తేదీన డీన్ అంజూ వాలీ టిక్కూ నేతృత్వంలో జరిగిన భేటీలో ఆ ప్రతిపాదనలకు అంగీకరించారు. అయితే మనుస్మృతి ప్రగతిశీల విద్యా వ్యవస్థకు వ్యతిరేకంగా ఉంటుందని, మహిళలు-అణగారిన వర్గాలకు వ్యతిరేకంగా ఉందని వామపక్ష ఎస్డీటీఎఫ్ ఢిల్లీ వర్సిటీకి లేఖ రాసింది.

## డ్రోన్ తో రసాయన పిచికారీ

ఏలూరు,యలమంచిలి మండలం కొంతేరు గ్రామంలో పాలకొల్లు ఆవ మురుగు డ్రైన్ లో గుర్రపు డెక్క, తూడు నిర్మూలన పనులను ప్రారంభించిన మంత్రి నిమ్మల రామానాయుడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాతూకొంతేరు పాలకొల్లు ఆవ డ్రైన్ లో గుర్రపు డెక్క, తూడు తొలగింపుకు డ్రోన్ ద్వారా రసాయనం చల్లే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. చంద్రబాబు నాయుడు రైతులకు మేలు జరిగేలా మురుగు డ్రైన్ లలో గుర్రపు డెక్క, తూడు నిర్మూలన పనులకు ప్రత్యేక నిధులు మంజూరు చేశారఅన్నారు.రాష్ట్రంలో 960 పనులకు 90 కోట్లుకు పైగా ఖర్చు పెడుతున్నాం అన్నారు. జగన్ ఐదేళ్లలో పంట కాలువలు, మురుగు డ్రైన్ లను నిర్లక్ష్యం చేసి అస్తవ్యస్తం చేసి రైతులకు నష్టం కలిగించారన్నారు.వ్యవసాయాన్ని, రైతు సంక్షేమాన్ని మరిచిపోయిన జగన్ ను రైతులు శాశ్వతంగా మర్చిపోవలన్నారు .రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం వ్యవసాయం, రైతు సంక్షేమంగా పనిచేస్తుందన్నారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు అధికారులు, కార్యకర్తలు, పాల్గొన్నారు..

## తిరుమలలో ప్రాంక్ వీడియోలు

### శ్రీవారి భక్తులతో ఆకతాయిల పరాచకాలు

తిరుమల, శ్రీవారి దర్శనం కోసం భక్తులు వేచి ఉండే నారాయణగిరి షెడ్లలో ఆకతాయిల ప్రాంక్ వీడియోలు కలకలం రేపాయి. తమిళనాడుకు చెందిన టీటీఎఫ్ వాసన్, అతని మిత్రులు ప్రాంక్ వీడియోలు చిత్రీకరించారుర. తరువాత ఆ వీడియోలను ఇన్స్టాగ్రామ్లో పోస్ట్ చేసారు. ఈ నేపథ్యంలో తమిళనాడులో పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. చివరకు టీటీడీ విజిలెన్స్ డిపార్ట్మెంట్ విచారణకు రంగంలోకి దిగింది.

## విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట "జూ"డాక్టర్ల నిరసన

విజయవాడ,విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి ముందు జూనియర్ డాక్టర్లు నిరసనకు దిగారు. గురువారం ఒక రోగి బంధువులు డాక్టర్ల పై దాడి చేసి ఫర్నిచర్ ధ్వంసం చేశారు అంటు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద "జూ"డాక్టరల్ఉ నిరసనకు దిగారు. మాకు కు రక్షణ కల్పించాలని డిమాండ్ చేసారు.

## భార్యను చంపి భర్త పరార్

మేడ్చల్ ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధి న్యూ భరత్ నగర్ లో భార్య మధు స్మిత(28)ను చంపి భర్త ప్రదీప్ పరారయ్యాడు. మధు స్మితను హత్య చేసి బ్యాగ్ లో పెట్టినట్లు పోలీసులు గుర్తించారు.ప్రదీప్ స్థానికంగా హోటల్ లో పనిచేస్తూ ఆరునెలలుగా న్యూ భారత్నగర్ లో నివాసం ఉంటూన్నారు. దాదాపు మూడు రోజుల క్రితం హత్య చెసి బ్యాగులో పెట్టి పరారైనట్లు అనుమానిస్తున్నారు. దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దంపతులు ఇద్దరూ ఒడిస్సా ప్రాంతానికి చెందిన వారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఉప్పల్ పోలీసులు, క్లూస్ టీమ్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు...

## పిచ్చోడు హల్ చల్

తాండూరు మతిస్థిమితం లేని ఓ పిచ్చోడు తాండూర్ పట్టణంలో హల్చల్ చేశాడు. రోడ్లపై ఎవరు కనిపించిన వారి పై దాడికి దిగాడు. దీంతో ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఏకంగా పిచ్చోడిపై వందమంది దాడికి దిగారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలో చోటుచేసుకుంది . స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో ఉదయం 6 గంటల కు రోడ్డుపై వెళ్తున్న కొందరు వ్యక్తులపై గుర్తుతెలియని వ్యక్తి పిచ్చోడు దాడికి తెగపడ్డాడు . దీంతో ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలు అయ్యాయి. పిచ్చోడు ఇష్టం ఉన్నట్లుగా వివరించడంతో, తీరును గమనించిన స్థానిక ప్రజలు పిచ్చోడు పై ప్రతి దాడి చేశారు ఏకంగా వందమంది పిచ్చోడి పై దాడికి తెగ పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పిచ్చోన్ని గొలుసులతో కట్టేసి స్టేషన్ కు తరలించారు.

## బందరు యూనిమోని ముందు ఆందోళన

మచిలీపట్నం,తాకట్టు పెట్టిన బంగారం మాయం కావటంతో మచిలీపట్నం రైతు బజారు ఎదురుగా ఉన్న యూనిమోని సంస్థకు వినియోగదారులు తాళాలు వేసి ఆందోళనకు దిగారు. వీరి ఆందోళనకు జనసేన పార్టీ నాయకులు మద్దతు తెలిపారు.వివరాల్లోకి వెళితే పోతురాజు అనే వ్యక్తి గత ఐదేళ్ల క్రితం అర కేజీ బంగారం తాకట్టు పెట్టి రూ.10లక్షలు రుణం తీసుకున్నాడు.తాకట్టు పెట్టిన పది రోజుల్లోనే బంగారం విడిపించుకునేందుకు వెళ్లగా బ్యాంక్ లో పని చేసే ఓ ఉద్యోగి బంగారాన్ని చోరీ చేశాడని, కేసు పెట్టామని బ్యాంక్ అధికారులు తెలిపారు.ఐదేళ్లు అవుతున్నా తన బంగారం ఇవ్వకపోవడంతో ఆగ్రహానికి గురైన పోతురాజు జనసేన నేతలతో కలిసి బ్యాంక్ వద్ద ఆందోళనకు దిగారు. తనకు న్యాయం చేయాలంటూ బ్యాంక్ కు తాళాలు వేసి ఆందోళన చేపట్టాడు.

# ఆదుకున్న గోదావరి...



విజయవాడ, జూలై 12, (న్యూస్ పల్స్) : ప్రకాశం బ్యారేజ్ నుంచి కృష్ణా పశ్చిమ డెల్టాకు సాగు నీటిని మంత్రులు విడుదల చేశారు. డెల్టా సాగు, తాగు అవసరాల కోసం జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు నీటిని విడుదల చేశారు. గుంటూరు జిల్లా ఉండవల్లి వద్ద డెల్టా ప్రధాన రెగ్యులేటర్ వద్ద కృష్ణమ్మకు పూజలు నిర్వహించారు.డెల్టా రెగ్యులేటర్ నుంచి గేట్లు తెరిచి 500 క్యూసెక్కులను విడుదల మంత్రి నిమ్మల విడుదల చేశారు. వ్యవసాయాన్ని, రైతులను కాపాడుకోవడం తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. - జగన్ హయాంలో ఇరిగేషన్ శాఖను 20 ఏళ్లు వెనక్కి లాగారని ఆరోపించారు. పట్టిసీమ వట్టిసీమన్న జగన్.. రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.చంద్రబాబు హయాంలో సాగునీటికి అత్యంత ప్రాధాన్య మిచ్చారని, ఒకేరోజు నాలుగు ఎత్తిపోతల పథకాలు ప్రారంభించామన్నారు. బ్యారేజ్ నుంచి తూర్పు, పశ్చిమ డెల్టాలకు నీటి విడుదల చేస్తున్నామని ప్రకటిచారు.వైసీపీ హయంలో అత్యవసరమైన తాగునీటి రంగం సైతం నిర్లక్ష్యానికి గురైందని.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో రాష్ట్రంలో ప్రతి నీటి బొట్టునూ ఒడిసిపట్టి.. సద్వినియోగం చేసుకొని ప్రజల తాగు, సాగునీటి అవసరాలను తీర్చేందుకు కృషిచేస్తున్నట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా. నిమ్మల రామానాయుడు అన్నారు.సమర్థవంతమైన జల వనరుల నిర్వహణ ద్వారా పెద్ద ఎత్తున సంపద సృష్టించవచ్చని.. తద్వారా సమాజంలోని అన్ని వర్గాలూ లాభపడటమే కాకుండా ఆయా ప్రాంతాలు, రాష్ట్రం సుభిక్షమవుతుందని పేర్కొన్నారు. ఉన్న ఆయకట్టును కాపాడుకుంటూ కొత్త ఆయకట్టు అభివృద్ధికి కృషిచేయడం ద్వారా వ్యవసాయ రంగాన్ని, రైతులను అభివృద్ధి పథంలో నడిపించొచ్చన్నారు.ముఖ్యమంత్రి ఎంతో ముందుచూపుతో పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారని.. దీంతో గోదావరి జలాలు, కృష్ణకు చేరి దాదాపు 13 లక్షల ఎకరాలకు సాగునీరు, 30-40 లక్షల మందికి తాగునీరు అందించేందుకు వీలవుతోందన్నారు.నిర్లక్ష్యానికి గురైన పట్టిసీమతో పాటు తాడిపూడి, పురోషోత్తపట్నం, పుష్కరల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పట్టిసీమ నుంచి 6,500 క్యూసెక్కుల వరకు నీరు విడుదలవుతోందని.. మరో 500-600 క్యూసెక్కుల తాడిపూడి నీరు కూడా దీనికి తోడవుతోందని వివరించారు. ఈ రోజు కాలువలకు నీరు విడుదల చేయడం చాలా ఆనందంగా ఉందని.. ఈ నీటిని తొలి ప్రాధాన్యంగా తాగునీటికి తర్వాత ఖరీఫ్ నారుమళ్లకు ఉపయోగించుకోవాలని సూచించారు.తూర్పు డెల్టాలో ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాల్లో 7,38,000 ఎకరాలకు సాగునీరుతో పాటు 11 నియోజకవర్గాల పరిధిలో చెరువులను నింపి ప్రజల దాహార్తిని తీర్చేందుకు వీలవుతుందన్నారు. డెల్టా కాలువలు, డ్రెయిన్లలో పూడిక, గుర్రపు డెక్క, తూటికాడ వల్ల నీరు సరిగా ప్రవహించడం లేదని.. ఈ విషయాన్ని గౌరవ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా యుద్ధ ప్రాతిపదికన గుర్రపుడెక్క, తూడు తీసే పనులకు ఆదేశాలు ఇచ్చినట్లు మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.గత ప్రభుత్వంలో నిర్వహణ లేక సాగునీటి రంగానికి తీవ్ర నష్టం వాటిల్లిందని.. చిన్నపాటి వర్షాలకు పంట నీట మునిగి రైతులకు నష్టం వాటిల్లే పరిస్థితి వచ్చిందన్నారు. వ్యవసాయ రంగానికి సాగునీటి కాలువలతో పాటు డ్రెయిన్లు చాలా ముఖ్యమని.. వీటిలో పూడిక తీయకపోవడం వల్ల కృష్ణా డెల్టా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు.పెడన, అవనిగడ్డ, బందరు ప్రాంతాల రైతులు ఇబ్బందిపడ్డారన్నారు. మెట్టప్రాంతాలైన నూజివీడు, మైలవరం, తిరువూరు ప్రాంతాలకు ప్రాణాధారమైన చింతలపూడి ఎత్తిపోతలకు గతంలో చంద్రబాబు నాయుడు గారి హయాంలో రూ. 4 వేల కోట్లు ఖర్చు చేస్తే.. గత ప్రభుత్వం రూ. 50 కోట్లు కూడా ఖర్చు చేయలేదన్నారు. దాదాపు 2,80,000 ఎకరాలకు సాగునీరు అందించగలిగే సామర్థ్యమున్న చింతలపూడిని నిర్లక్ష్యం చేయడం వల్ల పంట భూములు బీళ్లుగా మారే పరిస్థితి వచ్చిందన్నారు.ఇంతలా నిర్లక్ష్యానికి గురైన సాగునీటి రంగం అభివృద్ధికి గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు, జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గారు కృషిచేస్తున్నారని పేర్కొన్నారు. కాలువలకు నీరు విడుదల చేసే ముందు నిర్వహణ పనులు పూర్తిచేసేందుకు కృషిచేయడం జరుగుతుందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు.

## సూపర్ సిక్స్ ఎటు పోయింది ?

విశాఖపట్నం,ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ తల్లికి వందనం పథకాన్ని ఇవ్వాలని వైసీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్ నాథ్ డిమాండ్ చేశారు. ఈ పథకం అమలుపై విద్యార్థుల తల్లిదండ్రుల్లో అనుమానం ఉందని చెప్పారు. తల్లికి వందనంపై సీఎం చంద్రబాబు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని అన్నారు. ఇంట్లో ఎంతమంది ఉంటే అంత మందికి 15 వేలు ఇస్తామని ప్రస్తుతం మంత్రి నిమ్మల రామానాయుడు ఎన్నికల సమయంలో చెప్పిన వీడియోను ఆయన మీడియాకు చూపించారు. సూపర్ సిక్స్ ఎటు వెళ్లిందని ఆయన ప్రశ్నించారు.విశాఖను ఆర్థిక రాజధాని చేస్తాం అంటూ చంద్రబాబు చెపుతున్న మాటలను తాను చిన్నప్పటి నుంచి వింటున్నానని అమర్ నాథ్ ఎద్దేవా చేశారు. ఉచితం అని చెపుతూ ... అన్ని ఛార్జీలు కలిపి టన్నుకు 1,400 తీసుకుంటున్నారని విమర్శించారు. ప్రజలకు మంచి జరగాలనేదే తమ ఆశయమని చెప్పారు.తమ అధినేత జగన్ పై టీడీపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ఖండిస్తున్నామని అమర్ నాథ్ అన్నారు. భోగాపురం విమానాశ్రయం పనులు వేగంగా జరగడానికి తాము ఎంతో కృషి చేశామని, రైతులను ఒప్పించి భూసేకరణ చేశామని... తమ కృషిని కూటమి ప్రభుత్వ అకౌంట్ లో వేసుకుంటున్నారని మండిపడ్డారు. ఉత్తరాంధ్ర పర్యటనలో సీఎం చంద్రబాబు ప్రభుత్వ భవిష్యత్తు కార్యక్రమాల గురించి చెప్పకుండా... జగన్ పై విమర్శలు గుప్పించడం దారుణమని అన్నారు.

## భీమవరంలో కౌలు రైతుల నిరసన

భీమవరం ,ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సొంత ఇలాకాలో (జిల్లాలో) కౌలు రైతులు రోడ్డు ఎక్కారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం తాడేరు వంతెన వద్ద కౌలు రైతులు రాస్తారోకో నిర్వహించారు. గునుపూడి సౌత్ డ్రైన్ లో గుర్రపు డెక్క పేరుకుపోయిందని, అయితే ఇప్పటివరకు అధికారులు ఈ గుర్రపు డెక్కను తొలగించకపోవడంతో ఈ డ్రైన్ వెంబడి ఉన్న సుమారు 5 వేల ఎకరాల ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకంగా మారిందని, వెంటనే ప్రభుత్వం స్పందించి గుర్రపు డెక్కను తొలగించకపోతే క్రాప్ హాలిడే ప్రకటిస్తామని రైతులు హెచ్చరించారు. మరో ప్రక్క దాళ్వా ధాన్యానికి సంబంధించిన డబ్బును ప్రభుత్వ ఇంకా తమకు చెల్లించలేదని, అయినప్పటికీ ఖరీఫ్ సాగు నిమిత్తం అప్పులు చేసి ఆకుమడులు వేశామని, కాని పంట కాలువలు, డ్రైనేజీలను ప్రక్షాళన చేయకపోవడంతో ఆకుమడులు నీట మునిగి తమకు నష్టాన్ని తెచ్చాయని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట కాలువలు, డ్రైనేజీల ప్రక్షాళనకు నిధులు మంజూరు చేశామని అధికారులు ఒక ప్రక్క చెబుతుంటే, మరో ప్రక్క ఇంకా ఎప్పుడు పనులు ప్రారంభిస్తారని రైతులు ప్రశ్నిస్తున్నారు. గత రెండు నెలలుగా ఈ డ్రైన్ లో గుర్రపు డెక్కను తొలగించాలని అధికారులకు వినతులు చేసినప్పటికీ వారు స్పందించలేదని రైతులు ఆరోపించారు...

# లంచాలు ఇచ్చి ఉద్యోగాలు పొందిన వారిని తొలగిస్తాం

### ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం,డాక్టర్ వై.ఎస్.ఆర్. హార్టీకల్చరల్ యూనివర్శిటీ ఔట్ సోర్సింగ్ వవిధానంలో గత 6 నెలల క్రితం లంచాలు ఇచ్చి ఉద్యోగాలు పొందిన సుమారు 25 మందిపై విచారణ జరిపింది వారిని విధుల నుంచి తొలగిస్తామని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం వెంకట్రామన్నగూడెంలోని యూనివర్శిటీ ప్రధాన కార్యాలయంలో అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ 2019 నుండి 2024 వరకు గత ప్రభుత్వ అసమర్థత కారణంగా నిధులు లేక అభివృద్ధి కుంటుపడిందన్నారు. యూనివర్శిటీ ఉన్నత అధికారులు గత వైసీపీ ప్రభుత్వ నాయకులకు అనుకూలంగా వ్యవహరించి యూనివర్శిటీని భ్రష్టు పట్టించారన్నారు. ఔట్సోర్సింగ్ విధానంలో అర్హతలేని కొంతమంది వ్యక్తులు గత ప్రభుత్వ పెద్దలకు లంచాలు ఇచ్చి ఉద్యోగాలు పొందారన్నారు. తక్షణమే వారు 'చేస్తున్న ఉద్యోగ విధుల నుంచి తప్పుకోవాలని లేనిపక్షంలో వారిపై కేసులు నమోదు చేసి విచారణ జరిపిస్తామన్నారు. అలాగే ఫర్నిచర్ కొనుగోలుకు సుమారు 1 కోటి 50 లక్షలు ఖర్చు చేశారని దానిలో అవకతవకలు ఉన్నట్లు సమాచారం ఉందని దీనిపై కూడా విచారణ చేస్తామన్నారు. విద్యార్థులకు మౌళికవసతులు కల్పించి నాణమైన విద్య అందించేలా చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామన్నారు. యూనివర్శిటీపై వస్తున్న ఆరోపణలను ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

# శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమం



ఆత్మకూరు-శ్రీ ప్రస్థానం:-సాయిబాబానగర్ లో ఉండే శ్రీ చైతన్య పాఠశాలలో ప్రతినెల నిర్వహించే స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా ఈ నెల గ్రీన్ ఇండియా మిషన్ ప్రోగ్రాం ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం కు ముఖ్య అతిథిగా ఆత్మకూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పట్టాభి హాజరయ్యారు. విద్యార్థులకు మొక్కలను పెంచడం, అడవులను కాపాడుకోవడం వలన ఉపయోగాలను, వాటిని నరకడం వలన నష్టాలను వివరించారు. ప్రతి ఒక్కరూ ఒక చెట్టును పెంచవలసిందిగా కోరారు. ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజంలోని ప్రజలకు మొక్కలను పెంచడం గురించి తెలియజేస్తున్న శ్రీ చైతన్య యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల చేత ర్యాలీని ప్రారంభించి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుమిత్ర, ఏవో లోకేశ్వర్ రెడ్డి, డీన్ సత్యం రెడ్డి ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మైనర్ బాలిక హత్యకు కారకులైన దుండగు లను కఠినంగా శిక్షించాలి

**...సి.ఐ.టి.యు నాయకులు సుధాకర్.**



శ్రీ ప్రస్థానం న్యూస్ కోవెలకుంట్ల :- ఎనిమిది ఏళ్ళ మైనర్ బాలిక పై హత్యాచారం చేసి ఆపై హత్య కు పాల్పడ్డ దుండగులను వెంటనే ఎన్కౌంటర్ చేయాలనీ కోరుతూ శుక్రవారం నాడు కోవెలకుంట్ల మండలంలో ని స్థానిక పంచాయతీ ఆఫీస్ నందు మానవ హారం తో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పట్టణ పురవీదుల్లో ప్రభుత్వ పాఠశాల బాలలికలతో పాటు కలసి ర్యాలీ నిర్వహించారు ..ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ నంద్యాల జిల్లా ముచ్చుమర్రి లో గత వారం క్రితం మైనర్ బాలిక వాసంతి పై అఘాయిత్యానికి పాల్పడి ఆపై హత్య చేశారు.. ఇంతటి దారుణానికి ఒడిగట్టిన నిందితులు ముగ్గురిని వెంటనే ఎన్కౌంటర్ చేసి బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని,..భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో ఎస్ఎఫ్ఐ నాయకులు , మబు హుస్సేన్,వడ్డే సుబ్బరాయుడు ,. ఓబులేసు. , విజయ్ , వికలాంగుల సంఘం నాయకులు దేవరాజు తదితరులు పాల్గొన్నారు..

# గుండమ్మను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి

**దళితులపై దాడులను అరికట్టాలి**

**ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎండ్లూరి లాజరస్**



ఆదోని మండలం నాగనాథహల్లి గ్రామంలో దళిత మహిళ గుండమ్మను పొలం విషయంలో తగాద వల్ల దారుణంగా ట్రాక్టర్ తో గుద్ది హత్య చేసిన అగ్ర కులాల వారిని తక్షణమే అరెస్టు చేయాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎండ్లూరి లాజరస్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి విడుదల చేసిన పత్రికా ప్రకటనలో లాజరస్ మాట్లాడుతూ దళితురాలయిన గుండమ్మ కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని దోషులను కఠినంగా శిక్షించాలని అలాగే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్ట ప్రకారం వారి కుటుంబానికి ఒకరికి ఉద్యోగం కల్పించాలని, ఐదు ఎకరాల భూమి ఇవ్వాలని, 50 లక్షల ఆర్థిక సహాయం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర హోం మంత్రిగా ఒక దళిత మహిళ ఉన్నప్పటికీ దళిత మహిళ పైన దాడి జరగడం దారుణమైన సంఘటన అని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జిల్లా కలెక్టర్ గారు మరియు జిల్లా ఎస్పీ గారు చర్యలు తీసుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ అనంతరత్నం మాదిగ, డిసిసి ప్రధాన కార్యదర్శి సయ్యద్ నవీద్, డిసిసి కార్యదర్శులు బి సుబ్రహ్మణ్యం, అబ్దుల్ హై, ఎస్సీ సెల్ డబ్ల్యూ సత్యరాజు మొదలగు వారు పాల్గొన్నారు.

# గ్రామాలలో కొలువుదీరిన పీర్ల దేవుళ్ళు

**గ్రామాలలో ఏర్పడిన పీర్ల పండుగ వాతావరణం.**

తుగ్గలి/మద్దికేర,తుగ్గలి మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో పీర్ల దేవుళ్ళు గురువారం రోజున కొలువుదీరారు.గ్రామాలలో పీర్ల దేవుళ్ళు కొలువుదీరడంతో ఒక్కసారిగా పండుగ వాతావరణం ఏర్పడింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మరియు గ్రామ పెద్దలు మాట్లాడుతూ ఆదివారం రోజున చిన్న సెరగత్తు,సోమవారం రోజున ఒంటిపూట సెరగత్తు,మంగళవారం రోజున పెద్ద సెరగత్తులను నిర్వహిస్తున్నట్లు వారు తెలియజేశారు. చివరిగా బుధవారం రోజున పీర్ల దేవుళ్ళు ఏటికి వెళ్తారని వారు తెలియజేశారు. గ్రామాలలో ఎటువంటి అల్లర్లు,గొడవలు లేకుండా పీర్ల పండగను ఘనంగా నిర్వహించాలని వారు గ్రామ ప్రజలకు తెలియజేశారు.అదేవిధంగా ప్రజలందరూ స్వామి వారికి మొక్కులను తీర్చుకొని పీర్లదేవుల ఆశీర్వాదం పొందాలని వారు తెలియజేశారు.అదేవిధంగా గ్రామాలలో ఎటువంటి గొడవలు జరగకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని తుగ్గలి, జోన్నగిరి మరియు మద్దికేర ఎస్సైలు గ్రామ ప్రజలకు,పెద్దలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తుగ్గలి గ్రామ ముజావర్లు షేక్షావలి,ఖాసింవలి తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి లో దళారీ వ్యవస్థ అప్పుడే మొదలైంది- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

కౌతాళం,వైసిపి నాయకులు, కార్యకర్తలు ఎవరికీ భయపడవద్దని, ధైర్యంగా ఉండాలని, తానున్నానని మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక వైసిపి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైసిపికి ప్రజల మద్దతు ఉందని చెప్పడానికి 40 శాతం ఓట్లు రావడమే నిదర్శనమన్నారు. బిజెపి, టిడిపి, జనసేన పార్టీలు పన్నిన కుట్రలో భాగంగానే ఓడిపోయామని తెలిపారు. ప్రజాక్షేత్రంలో వైసిపిదే గెలుపని పేర్కొన్నారు. టిడిపి పాలనలో దళారి వ్యవస్థ అప్పుడే మొదలైందని తెలిపారు. వాల్మీకులంతా ఒకటేనని ఎన్నికల్లో చెప్పిన నాయకులు ప్రస్తుతం డీలర్ను, ఫీల్డ్ అసిస్టెంట్ను, వంట ఏజెన్సీలకు డబ్బులు దండుకుంటున్నారని విమర్శించారు. కనీసం వాల్మీకులను కూడా వదిలిపెట్టలేదని తెలిపారు. నియోజకవర్గంలో అధికారులు ప్రొటోకాల్ పాటించి అందరికీ న్యాయం చేయాలని, లేకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని చెప్పారు. ప్రజలకు మంచి సేవలందించామని, నాలుగోసారి కూడా గెలుపు సాధ్య మైందని తెలిపారు. ప్రజల కోసం తన కుటుంబం ఎల్లవేళలా అందుబాటులో ఉం టుందని, ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి, సర్పంచ్ పాల్ దినకర్,ఎంపిపి అమ్రేష్, జడ్పిటిసి రాధా ప్రియదర్శిని, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, కో ఆప్షన్ నెంబర్ మాబు సాబ్, మండల నాయకులు మహేందర్ రెడ్డి, ఏకం రెడ్డి, రామన్న గౌడ్, చెన్నప్ప, బసవ ప్రభు, దాట్ల సుబ్బరాజు, రాఘవేంద్రరెడ్డి, గురునాథెడ్డి, సుధాకర్ రెడ్డి, పాల్గొన్నారు.

# ఏపిలోనూ చేరికల రాజకీయం

**మండలిలో పట్టు సాధించేలా టిడిపి వ్యూహం**

**పార్టీలో చేరేందుకు పలువురు ఎమ్మెల్సీల ఆసక్తి**

**ఆచితూచి అడుగులు వేయాలన్న యోచనలో అధిష్టానం**

అమరావతి,జూలై12: ఏపిలోనూ చేరికల రాజకీయం మొదలయ్యింది. అసెంబ్లీ సమావేశాల కారణంగా మండలిలో పట్టు సాధించేలా టిడిపి వ్యూహం రచిస్తోంది. పార్టీలో చేరేందుకు పలువురు ఎమ్మెల్సీలు స్వచ్ఛందగా ఆసక్తి చూపుతున్నారు. అయితే ఆచితూచి అడుగులు వేయాలన్న యోచనలో అధిష్టానం ఉంది. రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అఖండ విజయాన్ని సాధించిన తెలుగుదేశం పార్టీ, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో పూర్తిస్థాయి మెజారిటీతో కొనసాగుతోంది. శాసనసభ లో ఏ బిల్లు అయినా సులభంగా పాస్ చేసుకునే బలం కూటమికి ఉంది. గత ఐదేళ్లు అధికారాన్ని అనుభవిం చిన వైసీపీ దారుణ పరాభవంతో 11 సీట్లకు మాత్రమే పరిమితమైంది. అయితే, వైసీపీకి శాసనమండలిలో మాత్రం బలం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఏవైనా కీలక బిల్లులను పాస్ చేయించుకోవాలంటే శాసనమండలిలో కూడా ఆమోదం తప్పనిసరి. ప్రస్తుత పరిస్థితుల్లో శాసనమండలిలో వైసీపీకి బలం ఉండడంతో అధికార కూటమి ప్రభుత్వానికి కొంత ఇబ్బంది తప్పదు అన్న విశ్లేషణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే కూటమి నేతలు శాసనమండలలోనూ బలం పెంచుకునే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. తెలుగుదేశం పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్న పలువురు ఎమ్మెల్సీలపై టిడిపి దృష్టి సారించినట్లు తెలుస్తోంది.అయితే, ఎమ్మెల్సీలను పార్టీలో చేర్చుకునే విషయంలో తెలుగుదేశం పార్టీ ఆచితూచి వ్యవహరిస్తోంది. గడిచిన ఐదేళ్లలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలపై తీవ్ర స్థాయిలో వ్యాఖ్యానించిన, ఇబ్బందుల కు గురి చేసిన వారి విషయంలో మాత్రం తెలుగుదేశం పార్టీ కఠినంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అటువంటి నాయకులను పార్టీలో చేర్చుకునేందుకు చంద్రబాబు కూడా ఆసక్తి చూపించడం లేదని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉంటే తాజాగా వైసీపీలో ఎమ్మెల్సీలుగా ఎన్నికై ఎన్నికల సమయంలో ఆయా స్థానాలకు రాజీనామా చేసి పలువురు టిడిపిలో చేరారు. వీటిలో రెండు స్థానాలకు కొద్ది రోజుల కిందట అధికారులు ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ విడుదల చేశారు. అయితే, వైసీపీ నుంచి అభ్యర్థులెవరు నామినేషన్ దాఖలు చేయకపోవడంతో టిడిపి నుంచి సి రామచంద్రయ్య, జనసేన నుంచి హరిప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గడిచిన ఐదేళ్లు అధికారం ఉన్నప్పటికీ తమను కనీసం పట్టించుకోలేదన్న భావన చాలా మంది ఎమ్మెల్సీ లలో ఉంది. అటువంటి వారంతా ఇప్పుడు అధికార తెలుగుదేశం పార్టీ వైపు చూస్తున్నట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అటువంటి వారిపైన తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించి చేర్చు కునేందుకు ఆలోచన చేస్తున్నట్లు చెబుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్సీలుగా ఉన్నప్పటికీ కనీసం గౌరవం, గుర్తింపు దక్కకపోవడం పట్ల అవమాన భారంతో ఉన్న పలువురు ఎమ్మెల్సీలు ప్రస్తుత అధికార తెలుగుదేశం పార్టీలో చేరేందుకు సంసిద్ధులవుతున్నారు. ఈ క్రమంలోనే తమకు సన్నిహితంగా ఉండే మంత్రులు, ఎమ్మెల్యేల ద్వారా టిడిపిలో చేరేందుకు రాయబారాలను పంపుతున్నారు. ఇప్పటికే పలువురు ఎమ్మెల్సీలు ఈ మేరకు ప్రయత్నాలు చేస్తున్నారు. మంత్రులను కలిసి తమ ఆసక్తిని తెలియ జేస్తున్నారు. ఇప్పటికే ఐదుగురు ఎమ్మెల్సీలు తెలుగుదేశం పార్టీకి చెందిన కీలక నేతలు, మంత్రులను కలిసి మాట్లాడినట్లు చెబుతున్నారు. శాసనమండలి డిప్యూటీ చైర్మన్ జకియా ఖానం ఇటీవల రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ను కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. అధికారంలో ఉన్న ఐదేళ్లు తమకు ప్రాధాన్యం ఇవ్వలేదని, ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చి ఉద్ధరించామన్నట్టుగా చూశారని ఓ ఎమ్మెల్సీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించడం గమనార్హం. అధికారంలో ఉన్నంతకాలం జగన్ తమతో ఒక్కసారి కూడా ప్రత్యేకంగా కూర్చుని మాట్లాడిన దాఖలాలు లేవని అసంతృప్త ఎమ్మెల్సీలు ప్రస్తావిస్తున్నట్లు చెబుతున్నారు. ఇటీవల ఎన్నికల్లో ఘోర పరాజయం తరువాత మాత్రమే జగన్ తమతో ప్రత్యేకంగా మాట్లాడినట్లు పలువురు పేర్కొంటున్నారు. ఇప్పుడు కూడా తమ అవసరం వచ్చింది కాబట్టి పిలిచారని, అది కూడా తమ గురించి కాకుండా మండలిలో తన కోసం నిలబడాలని చెప్పినట్లు పలువురు ఎమ్మెల్సీలు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రస్తుతం ఐదుగురు ఎమ్మెల్సీలు తమకు తెలిసిన మంత్రుల ద్వారా టిడిపిలో చేరేందుకు రాయబారాలు నెరపుతున్నారు. ఇదే ఆలోచనలో మరింత మంది ఎమ్మెల్సీలు ఉన్నట్లు చెబుతున్నారు. కొంతమంది టిడిపి మంత్రుల ద్వారా పార్టీలో చేరేందుకు అవకాశం కల్పించాలంటూ కోరుతున్నారు. మరి కొంతమంది వచ్చి కలుస్తామంటూ మంత్రులకు వర్తమానాన్ని పంపిస్తున్నారు. అదే సమయంలో వైసీపీ మద్దతుతో గెలిచిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీల్లో కూడా ఇద్దరూ తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులతో టచ్ లోకి వెళ్లినట్లు చెబుతున్నారు.

# పదవ తరగతి విద్యార్థులు అందరూ ఉత్తీర్ణత సాధించాలి

**మెనూ ప్రకారం పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందించాలి**

**జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా...**

**కర్నూలు ప్రభుత్వ టౌన్ మోడల్ హైస్కూల్ ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్..**

**మధ్యాహ్న భోజనం రుచి చూసిన జిల్లా కలెక్టర్..**

కర్నూలు, జూలై 12 : పదవ తరగతిలో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలని, అందుకనుగుణంగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా ఉపాధ్యాయులను ఆదేశించారు.శుక్రవారం కర్నూలు నగరంలోని ప్రభుత్వ టౌన్ మోడల్ హై స్కూల్ ను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు..పాఠశాలలో విద్యా బోధన, మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు ఏర్పాటుచేసిన మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు..వంట సరుకుల నాణ్యత, కోడిగుడ్ల పరిమాణం పరిశీలించారు..అనంతరం మధ్యాహ్న భోజనం రుచి చూశారు. విద్యార్థులు ఆరుబయట భోజనం చేస్తున్న విషయాన్ని గమనించిన కలెక్టర్ వారిని కారిడార్ లో కూర్చోబెట్టి భోజనం చేయించి, ఆ తరువాత కారిడార్ ను శుభ్రం చేసుకోవాల్సిందిగా ఉపాధ్యాయులను ఆదేశించారు. మెనూ ప్రకారం పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు..ఈ సందర్భంగా కలెక్టర్ ఎన్ని గంటలకు భోజనం అందిస్తున్నారు, భోజనం బాగుందా అని కలెక్టర్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు..అలాగే విద్యార్థినులతో ఉద్దేశించి మాట్లాడుతూ, మీకు రక్త పరీక్షలు చేస్తున్నారా ? ఎన్నిసార్లు చేశారు? ఐరన్, ఫోలిక్ యాసిడ్ సప్లిమెంట్లు ఇస్తున్నారా అని ప్రశ్నించారు.. రక్త పరీక్షలు ఆరు నెలలకు ఒకసారి చేయిస్తున్నారని , ఐరన్, ఫోలిక్ యాసిడ్ సప్లిమెంట్లు అందజేస్తున్నారని విద్యార్థినులు కలెక్టర్ కు వివరించారు..అనంతరం ప్రాంగణంలో ఉన్న షెడ్స్, పరిసరాలు, వాటర్ ప్లాంట్, మరుగుదొడ్లను కలెక్టర్ పరిశీలించారు. మరుగుదొడ్లను సరిగా నిర్వహించడం లేదని, వాటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ ఆదేశించారు..అలాగే పరిసరాలు కూడా శుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు..అనంతరం హెడ్మాస్టర్ ఛాంబర్ లో ఉపాధ్యాయులతో సమావేశం అయ్యారు.. ఈ సందర్భంగా హాజరు పట్టికను పరిశీలించి అందరూ ఉపాధ్యాయులు హాజరు అయ్యారా లేదా చూశారు.. గత సంవత్సరం 46 శాతం మాత్రమే ఉత్తీర్ణత కావడం పట్ల కలెక్టర్ స్పందిస్తూ బీసీ హాస్టల్ , ఎస్సీ హాస్టళ్ళలో ఉన్న విద్యార్థులు 80% శాతం పైగా ఉత్తీర్ణత సాధించారని, అలాగే ఇక్కడ కూడా ఉత్తీర్ణత శాతం తగ్గకూడదని కలెక్టర్ ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈ సంవత్సరం పదవ తరగతి విద్యార్థులు అందరూ ఉత్తీర్ణత పొందాలని, అందుకోసం ఇప్పటినుండే కార్యాచరణ రూపొందించుకొని అమలు చేయాలని కలెక్టర్ సూచించారు.. ఉచితంగా ట్యూషన్ చెప్పేందుకు ముందుకు వచ్చే వారు ఉంటారని, అలాంటి వారిని ఉపయోగించుకోవాలని సూచించారు..అలాగే ఎలక్ట్రానిక్ మాధ్యమాల ద్వారా ప్రసారమయ్యే పాఠ్యాంశాలను విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించాలని, ముఖ్యమైన ప్రశ్నలు ఏ విధంగా ఉంటాయి, .ఇలా అన్ని విధాలుగా విద్యార్థులను ప్రోత్సహించి ప్రతి ఒక్కరూ పాస్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు. డీఎస్సీ పరీక్ష తర్వాత ఉపాధ్యాయుల కొరత ఉండదని , ఉపాధ్యాయులను రేషనలైజేషన్ చేసి అన్ని పాఠశాలలలో కొరత లేకుండా చూడాలని కలెక్టర్ జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్ ను ఆదేశించారు.అనంతరం ఇదే ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల సముదాయాన్ని కలెక్టర్ పరిశీలించారు. కళాశాల ల్యాబ్స్, లైబ్రరీని సందర్శించారు..లైబ్రరీ ని విద్యార్థులు ఉపయోగించుకుంటున్నారా అని అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు.. కాలేజీ విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేసేందుకు ఒక షెడ్డు అవసరమని కాలేజి ప్రిన్సిపల్ కలెక్టర్ దృష్టి తీసుకురాగా అందుకు సంబంధించిన ప్రపోజల్స్ పంపించాలని కలెక్టర్ వారికి సూచించారు.

# బిచిన్నారి వాల్మీకి వసంతని అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి ,

నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం మచ్చుమర్రి గ్రామంలో ఈనెల 7వ తేదీన ఆదివారం రోజు ఆడుకోవడానికి బయటకు వెళ్లిన ఐదో తరగతి చదువుతున్న వసంతి అని తొమ్మిది సంవత్సరాల అమ్మాయి వాల్మీకి వసంత అదే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు తీసుకొని పోయి అత్యాచారం చేసి. పాప తల్లిదండ్రులకు చెప్తానని భయంతో వసంతిని హత్య చేసి పక్కనే ఉన్న కాలువలో వేయడం అమానుషమని. ప్రజా పరిరక్షణ సమితి అధ్యక్షుడు కె బలరాం గారు పేర్కొన్నారు. ఇంతటి దుర్మార్గానికి పాల్పడిన యువకుల ముగ్గురిని పోలీసులు కఠినంగా శిక్షించాలి అని కె బలరాం గారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు× శుక్రవారం ఆయన స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముగ్గురు నిందితులను ఎన్కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు ఈ ప్రభుత్వం రాష్ట్ర హోం మంత్రి గారు బాధిత కుటుంబాని పరామర్శించి 10 లక్షల ఆర్థిక సహాయం ఒక ప్రభుత్వ ఉద్యోగం కల్పించి ఆదుకుంటారని డిమాండ్ చేయడంజరిగింది రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు రాష్ట్ర నలు మూలలను కూడా జరగకుండా రాష్ట్ర మొత్తం నిర్ధాంతమైపోయేలా ఎన్కౌంటర్ చేసి వసంతి ఆత్మ శాంతించేలా చేయాలని ఆయన డిమాండ్ చేశారు బి. ఈ కార్యక్రమంలో ప్రజా పరిరక్షణ సమితి అధ్యక్షుడు కె బలరాం గారు, డేవిడ్, శ్రీ పద్మా నంద యోగీ గారు, శ్రీరాములు చంద్ర శేఖర్ శివ కుమార్,మోహన్ రెడ్డి, ఈశ్వర్, చంద్ర శేఖర్, రమణ వాల్మికి, ఖాద్రీ, తదితరులు పాల్గొన్నారు. ఐ. బలరాం



# శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

తిరుమల,తిరుమల శ్రీ వెంకటేశ్వరుడిని తెలంగాణ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ దర్శించుకున్నారు. విఐపి విరామ సమయంలో స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనా యకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందించగా?.. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసారు. ఆలయం వెలుపల తెలంగాణ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ?.. ప్రభుత్వాలు ప్రజల అభీష్టం మేరకు మారుతుంటాయని అన్నారు. ప్రజలకు మంచి చేస్తే మరో అవకాశాని మనకి కల్పిస్తారని తెలియజేశారు.

# శ్రీవారిని దర్శించుకున్న టీచర్స్ ఎమ్మెల్సీ రఘువర్మ

తిరుమల,తిరుమల శ్రీవారిని టీచర్స్ ఎమ్మెల్సీ రఘువర్మ దర్శించు కున్నారు. విఐపి విరామ సమయంలో స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించు కున్నారు. దర్శనానంతరం రంగనా యకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా?.. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసారు. ఆలయం వెలుపల టీచర్స్ ఎమ్మెల్సీ రఘువర్మా మీడియాతో మాట్లాడుతూ?.. గత ప్రభుత్వ హయాంలో భక్తులకు సరైన సౌకర్యాలు కల్పించలేదని తెలిపారు. అనుభవిజ్ఞుడైన చంద్రబాబు పాలనలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# పంతం నిలబెట్టుకున్న మరియమ్మ

పిఠాపురం,పవన్ రావాలి పాలన మారాలి అన్న నినాదంతో అత్యధిక మెజార్టీతో గెలిచిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అదే మాటలో ఓ పెద్ద వయసుగల మరియమ్మ నినాదం పట్టింది. ఎలక్షన్ ముందు పవన్ కళ్యాణ్ ప్రచార సమయంలో బాబు నువ్వే గెలుస్తావు గెలిచిన వెంటనే నా రిక్షా అమ్మి పార్టీ చేస్తానని మరియమ్మ అన్నది. ఆమె కుటుంబం ఈ రిక్షా తొక్కడం పైనే ఆధారపడి ఉంది.అన్నట్టే చేసింది. ఎన్నికల సమయంలో పవన్ తో పాటు ఉన్న సినీ డైరెక్టర్ శ్రీనివాస్ కు మరియమ్మ పంతం తెలిసింది. ఆమె కోరిక కోరుకున్న విధంగా పవన్ కళ్యాణ్ గెలవడంతో ఆనందించి మరియమ్మకు ఆటో బేబీ సినిమా డైరెక్టర్ శ్రీనివాస్ కొని ఇచ్చాడు

# మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

కోరుట్ల, నియోజకవర్గం లోని ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల కార్యాలయంలో ఎక్కువగా వచ్చే దరఖాస్తులు జీరో కరెంట్ బిల్ కి సంబంధించినవి కావడంతో దరఖాస్తులను ఇంకా ఎందుకు అప్ డేట్ చేయడం లేదని, ఆన్ లైన్ లో చెక్ చేసి వెంటనే అప్ డేట్ చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కోసం ప్రజా పాలన కార్యక్రమం ప్రారంభించిందని, అధికారులు సమయపాలన పాటిస్తున్నారా లేదని, మండల కార్యాలయంలో క రికార్డులన్నీ కలెక్టర్ చెక్ చేసి ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులు కానీ, కార్యాలయ పనులను కానీ పెండింగ్ లేకుండా వెంట వెంటనే పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సి.ఈ. ఓ. రఘువరన్, ఆర్డీవో శ్రీనివాస్, మండల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJITHA PRINTERS, H.NO: 46/801, BUDHAWARAPETA, KURNOOL DIST. - 518001, ANDHRA PRADESH, INDIA. PUBLISHED AT H.NO: 43/217A, N R PETA, KURNOOL DIST., ANDHRA PRADESH, INDIA. EDITOR : PERUMALLA CHENNAKESHAVULU.RNI No : APTEL 2020/80757